# ముగిసిన కబడ్డీ పోటీలు



-బాలికల విజేత ఖమ్మం
-బాలుర విజేత హైదరాబాద్
-నృత్యాలతో అలరించిన చిన్నారులు

2 లో

www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
మంగళవారం | 11 | నవంబర్ | 2025
పేజీలు : 8

# ఆందోళన బాటనలో పింఛన్‌దారులు



-ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన
-17న ధర్నా- దశల వారి ఆందోళన కార్యక్రమాలు



ప్రజాపక్షం/ ఖమ్మం : రాష్ట్ర ప్రభుత్వం పింఛన్‌దారుల సమస్యలను ప్రత్యేకించి ఉద్యోగులు దాచుకున్న నగదును ఇవ్వడం లేదని పింఛన్‌దారులు ఆందోళన బాట పట్టారు. ఇప్పటి వరకు జిల్లా స్థాయిలో వినతి పత్రాలు, నిరసనలకు పరిమితం కాగా ఇప్పుడు రాష్ట్రస్థాయిలో ఆందోళన కార్యక్రమానికి శ్రీకారం చుట్టడంతో పాటు ప్రభుత్వం తమ సమస్యను పరిష్కరించేంత వరకు ఆందోళనలు కొనసాగించాలని నిర్ణయించారు. రాష్ట్ర వ్యాప్తంగా 15వేల మంది ఉద్యోగ విరమణ చేసిన వారికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి సుమారు రూ. 8వేల కోట్లు రావాల్సి ఉంది. ఇవి రాకపోవడంతో సర్కారుపై పింఛన్‌దారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాము దాచుకున్న

మిగతా 2లో..

# పాత విధానంతోనే మస్టర్లు






-సింగరేణి కార్మికులకు సూపర్ స్పెషాలిటీ వైద్యం
-మెడికల్ బోర్డు కొనసాగింపు
-యాజమాన్యంతో గుర్తింపు సంఘం చర్చలు ఫలప్రదం

ప్రజాపక్షం/ ఖమ్మం : సింగరేణిలో మస్టర్ల విషయంలో పాత విధానాన్నే కొనసాగించడానికి యాజమాన్యం అంగీకరించింది. గతంలో 100 మస్టర్ల స్థానే 150 మస్టర్లు తప్పనిసరి అంటూ జారీ చేసిన సర్క్యులర్‌కు సంబంధించి కార్మికులపై ఎటువంటి ఒత్తిడి లేకుండా చూసేందుకు యాజమాన్యం అంగీకరించింది. సోమవారం సింగరేణి భవన్‌లో సింగరేణి గుర్తింపు సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులతో యాజమాన్యం చర్చలు జరిపింది. ఈ చర్చల్లో సొంతింటి పథకాన్ని అమలు చేయడానికి యాజమాన్యం అంగీకరించింది. సొంతింటి

మిగతా 2లో..

# మూగపోయిన గర్జించిన గొంతుక



ప్రజాపక్షం/ ఖమ్మం : ప్రాంతీయ అభిమానాన్ని చాటిన ఆ గొంతుక ఆర్థిక అసమానతలపై గర్జించింది. అంటరానితనాన్ని ప్రశ్నించింది. పడిపోతున్న మానవ సంబంధాలను తట్టి లేపింది. శ్రమ విలువను తెలిపిన ఆ గొంతు శ్రమ దోపిడీని నిలువరించేందుకు ప్రయత్నించింది. కలంతో గళంతో సమకాలిన సమాజంలో రుగ్మతలను తరిమేసేందుకు ప్రయత్నించిన ఆ గొంతుక శాశ్వతంగా మూగపోగ ఆ కలం ఇక కదలనన్నది. సహజ కవి, ప్రకృతి ప్రేమికుడు తన కలాన్ని, గళాన్ని ప్రజల కోసం వినియోగించిన అందెశ్రీ (అందె ఎల్లయ్య) ఆదివారం మరణించారు. కష్టంతో కలగలిసి పుట్టిన అందెశ్రీ అనాథగా పెరిగాడు. అన్నింటికి దూరంగా పెరిగిన అందెశ్రీకి గ్రహించే శక్తి మాత్రం మొండు కావడంతో ఒక్కసారి వింటే వెంటనే తిరిగి అలవోకగా చెప్పేవాడు. ఆయన చదువుకోలేదు. కానీ కొన్ని తరాలు గుర్తుంచుకునే, పాడుకునే పాటలు రాశాడు. అందెశ్రీ పాటకు ఒక ప్రత్యేకత ఉండేది. అందేశ్రీ కలానికి పదునెక్కువ. ఆయన మాటలు తూటాల మాదిరి పేలేవి. అందెశ్రీ పాట చైతన్యానికి ప్రతీకగా నిలిచింది. సమాజంలోని రుగ్మతలను, శృతిమించిన కోర్కెలను, మనుషులలో పెరిగిన కుల, మత తత్వాలను నిలదీస్తూ ఆయన రాసిన మాయమైపోతున్నడమ్మ మనిషన్నవాడు, మచ్చుకైన లేడు చూడు మనవత్వమున్నవాడు అంటూ మనుషులలో మారిన గుణాన్ని ఎత్తి చూపాడు. మానవత్వం ఉన్న వారు కనుమరుగవుతున్నారని అని సమాజాన్ని హెచ్చరించిన అందెశ్రీ ఈరోజు అతనే కనుమరుగయ్యాడు. పెరిగిన ఆధ్యాత్మికతను, పెరుగుతున్న కోర్కెల తీరును ఆయన తప్పుపట్టారు. పావలా ఆగరుబత్తి వెలిగించి పది కోట్ల వరాలు కోరుతున్నారంటూ నేటి భక్తుల తత్వాన్ని తెలిపారు. చిన్నప్పుడు మఠాలు, యాగాల మధ్య సాగిన అందెశ్రీ జీవితంపై వాస్తవికత చాలా మార్పులు తెచ్చింది. అప్పుడే కొమ్మ చెక్కితే బొమ్మరా కొలిచి మొక్కితే అమ్మరా అంటూ సరికొత్త గీతాన్ని అందుకున్నాడు. మలిదశ తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున సాగడంలో అందెశ్రీ పాటలు ప్రధాన భూమిక పోషించాయి. జయ జయయే తెలంగాణ, జనని జయకేతనం అంటూ గొంతెత్తిన అందెశ్రీ జన జాతరలో మనమంతా జన నినాదమై కదలాలి. జై భోళో తెలంగాణ అంటూ ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షను తట్టిలేపిన అందెశ్రీకి ఉమ్మడి ఖమ్మంజిల్లాతో ప్రత్యేక అనుబంధం

మిగతా 2లో..

# ఆందోళన బాటనలో పింఛన్‌దారులు

(మొదటిపేజీ తరువాయి)

జిపిఎఫ్ డబ్బులకు మోక్షం కలగడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఉద్యోగి ఉద్యోగ విరమణ తర్వాత తమకు వచ్చే డబ్బుతో తాము ఎంచుకున్న ప్రణాళిక ప్రకారం నడుచుకోవాలని భావిస్తారు. పిల్లల వివాహాలు, సొంతింటి నిర్మాణం ఇతరత్రా రకరకాల ఆలోచనలతో ప్రణాళికలు రూపొందించుకుంటారు. కానీ 19 మాసాలు గడిచినా ఉద్యోగ విరమణ తర్వాత బకాయిలు రాకపోవడంతో ఆందోళన బాట పట్టారు. గతంలో కలెక్టర్లకు, ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు ఇచ్చిన వారు ఏకంగా ఈనెల 17న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కులో భారీ ధర్నా కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. ఉద్యోగ విరమణ చేసిన వారికి ఆరోజే అణ పైసాలతో సహా లెక్కకట్టి ఇచ్చి గౌరవంగా సాగనంపుతామని గతంలో వాగ్దానం చేశారు. ఇప్పుడు వాగ్దాన భంగం జరగడంతో పింఛన్‌దారులు ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా 15 మంది పింఛన్‌దారులు మనో వేదనతో మృతి చెందారని ప్రభుత్వ పింఛన్‌దారుల సంఘాలు ఆరోపిస్తున్నాయి. 30 నుంచి 40 ఏళ్ల పాటు ప్రభుత్వ ఉద్యోగులుగా ప్రజలకు సేవలందిస్తే ప్రభుత్వం ఇచ్చే మర్యాద ఇదా అని వారు ప్రశ్నిస్తున్నారు. 58 సంవత్సరాల ఉద్యోగ విరమణ వయస్సును గత కేసిఆర్ ప్రభుత్వం 61 సంవత్సరాలకు పెంచింది. దీనితో మేలు జరుగుతుందని భావించారు. కానీ అప్పుడే సర్వీసు పెరుగుతుందని ఆలోచించారు కానీ రాష్ట్ర ప్రభుత్వ ఖజానా ఖాళీ కావడంతో ఉద్యోగ విరమణ అనంతరం ఇవ్వాల్సిన నగదు ఇవ్వలేక ఈ పని చేశారని పింఛన్‌దారులు గ్రహించలేకపోయారు. ప్రభుత్వం మారింది 20 నెలలు గడిచినా బకాయిలు చెల్లించడం లేదు. 2024 మార్చి నుంచి 2025 అక్టోబర్ వరకు సుమారు 15వేల మంది ఉద్యోగులు ఉద్యోగ విరమణ పొందారు. వీరికి ఒక్కొక్కరికి రూ. 50లక్షల నుంచి రూ. 70లక్షల చొప్పున సుమారు రూ.8వేల కోట్లు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. దాచుకున్న డబ్బులే 25 శాతం ఉన్నాయని పింఛన్ దారుల సంఘాలు చెబుతున్నాయి. వాస్తవంగా వారికి వచ్చే ఉద్యోగుల వేతనం నుంచి 6.25శాతం తక్కువ కాకుండా పొదుపు చేయాల్సి ఉంటుంది. అయితే కొంత మంది ఉద్యోగులు తమ భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని 10 నుంచి 15 శాతం వరకు పొదుపు చేసుకున్నారు. వారు సర్వీసులో ఉన్నంత వరకు వడ్డీ వస్తుంది. ఉద్యోగ విరమణ చేయగానే ఆ మొత్తాన్ని అందించాల్సి ఉంటుంది. ఇప్పుడు ఉద్యోగ విరమణ చేసిన తర్వాత వడ్డీ రాకపోవడంతో 20 నెలలుగా ఉద్యోగులు తమ పొదుపుపై వడ్డీని నష్టపోవాల్సి వస్తుంది. ఇదిలా ఉండగా దేశంలో తెలంగాణ రాష్ట్రంలో ఉద్యోగ విరమణ చేసిన వారికి రిటైర్‌మెంట్ బెన్‌ఫిట్స్ ఇవ్వని రాష్ట్రం ఏది లేదని పింఛన్‌దారుల సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఉద్యోగ విరమణ పొందిన పింఛన్ తప్ప రూపాయి చేతికి రాకపోవడంతో చాలా మంది తీవ్ర మానసిక క్షోభను అనుభవిస్తున్నారు. ప్రభుత్వం చర్చలు జరపడం, హామీలు ఇవ్వడం తప్ప నెరవేర్చడం లేదన్న ఆవేదన రాష్ట్ర వ్యాప్తంగా పింఛన్‌దారుల్లో ఉంది. ఉద్యోగ విరమణ తర్వాత తమ ప్రణాళికలు ఏది అమలు కాక కొందరు మరణించారని అనారోగ్యం బారీనపడినప్పుడు కనీసం వైద్యానికి కూడా డబ్బులు లేక ప్రాణాలు కోల్పోతున్నారన్న ఆవేదన సర్వత్రా వ్యక్తమవుతుంది. పింఛన్‌దారులతో పాటు నగదు రహిత ఆరోగ్యం అందుబాటులోకి రాలేదని ప్రభుత్వానికి ఎన్ని సార్లు విన్నవించినా కనీసం స్పందించడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికే కొందరు ఉద్యోగ విరమణ అనంతరం రావాల్సిన బెన్‌ఫిట్స్ కోసం న్యాయస్థానాలను ఆశ్రయించారు. అయినా ప్రభుత్వం స్పందించకపోవడంతో ఆందోళన బాట పట్టారు. ప్రభుత్వం ఇప్పటికైనా పింఛన్‌దారుల సమస్యకు సంబంధించి తక్షణం ఆలోచన చేయాలని దశల వారీగా చెల్లింపులు ప్రారంభించకపోతే ప్రభుత్వం అప్రతిష్టనుమూటకట్టుకోవాల్సి వస్తుంది.

# పాత విధానంతోనే మస్టర్లు

(మొదటిపేజీ తరువాయి)

ఇండ్ల నిర్మాణానికి సంబంధించి ఏర్పాటైన అధికారిక కమిటీలో యూనియన్ సభ్యులను కూడా తీసుకుని విధి విధానాలు రూపొందించడానికి యాజమాన్యం అంగీకరించింది. హైదరాబాద్‌లో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల ఏర్పాటుకు టెండర్ ప్రక్రియ పూర్తయినందున త్వరలోనే ప్రారంభిస్తామని గోదావరి ఖనిలో గుండె జబ్బులకు సంబంధించిన ఆసుపత్రిని కూడా నెల రోజుల లోపు ప్రారంభిస్తామని యాజమాన్యం తరుపు నుంచి గుర్తింపు సంఘానికి హామీ ఇచ్చారు. బదిలీ వర్కర్లుగా నియామకం అవుతున్న వారు ఇక నుంచి జనరల్ అసిస్టెంట్ ట్రైనీలుగా నియమించబడతారని, కార్మికులకు ఇచ్చే అదనపు సౌకర్యాలపై ఆదాయ పన్నును యాజమాన్యం భరించేవిధంగా చర్చల్లో నిర్ణయం తీసుకున్నారు. మెడికల్ బోర్డును యథాతథంగా కొనసాగించడంతో పాటు కోల్ ఇండియా కమిటీ రిపోర్టు ప్రకారం హోదాలు ఇవ్వాలని నిర్ణయించారు. సింగరేణిలో మారుపేర్లపై ఉద్యోగం చేస్తున్న కేసులకు సంబంధించి విడి విడిగా పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని పర్సనల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఉద్యోగులకు రిక్రూట్‌మెంట్ ద్వారా ఆఫీసర్ క్యాడర్ ఈ1గ్రేడ్ ఇచ్చుటకు చర్చల్లో యాజమాన్యం అంగీకరించింది. అన్ని గనుల్లో కార్మికుల సౌకర్యం కోసం కప్‌బోర్డులు, లాకర్స్ ఏర్పాటు చేయడంతో పాటు రూ.1000లోపు పింఛన్ పొందుతున్న సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వ పెన్షన్ రూ. 2016 ఇప్పించుటకు చర్చల సందర్భంగా నిర్ణయం తీసుకున్నారు. సింగరేణి ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. బలరాం సమక్షంలో జరిగిన ఈ చర్చలకు శాసనసభ్యులు, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు కూనంనేని సాంబశివరావు, డైరెక్టర్ (పా) గౌతమ్ పొట్రు, డైరెక్టర్లు వెంకటేశ్వర్లు, సూర్యనారాయణ, తిరుమలరావు, గుర్తింపు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వాసిరెడ్డి సీతారామయ్య, కె. రాజ్‌కుమార్, యూనియన్ నాయకులు మిరియాల రంగయ్య, కె. సారయ్య, కె. వీరభద్రయ్య, వైవి రావు, సమ్మయ్య, ఎం.ఎల్లాగౌడ్, అక్బర్‌అలీ, వంగా వెంకట్ పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాల కొరత

**ఇబ్బందుల్లో రైతులు**



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఐకెపి, డిసిఎంఎస్, పిఎసిఎస్, మెప్మా వారి ఆధ్వర్యంలో 38 కొనుగోలు కేంద్రాలు కొనసాగుతుండగా వాటిల్లో ఉండాల్సిన సౌకర్యాలు లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలుపుతున్నారు. పురికోస, మంచి నీరు, టెంట్, కాటా, పరదాలు, తేమశాతం యంత్రం తదితర సౌకర్యాలు ఉండాల్సి ఉండగా వాటిల్లో పూర్తిస్థాయిలో సౌకర్యాలు లేనందున రైతుల అవస్థలు పడుతున్నారు. గత కొన్ని రోజుల క్రితం రైతుల సౌకర్యార్థం ప్రారంభించిన కొనుగోలు కేంద్రాలు పూర్తిస్థాయిలో సౌకర్యాలు లేనందున రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని సెంటర్లలో టెంటు లేదు మరికొన్ని సెంటర్లో కాటా ప్రైవేటు వారిదే వాడుతున్నట్లు సమాచారం. మరికొన్ని కేంద్రాలలో దళారులు ప్రవేశించి బేరాలు చేసుకుంటున్నారు. మరికొన్ని కేంద్రాలలో టెంట్ లేనందున ఎండకు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని కేంద్రాలలో చెట్లు నీడే వాడుకుంటున్నారు. మంచినీరు లేనందున ఎవరికి వారే మంచినీరు తెచ్చుకుంటున్నారు. మరి కొన్ని కేంద్రాలలో కాటాలో తేడా వచ్చింది కొన్ని బస్తాలు 40, 3 కేజీలు మరి కొన్ని బస్తాలు 42 కేజీలు మరికొన్ని బస్తాలు 41 ,200 గ్రాములు వ్యత్యాసాలతో హమాలీలు కాటా వేసి కాటా లలో వ్యత్యాసం చూపిస్తూ రైతులను మోసం చేస్తూ ఇబ్బందులు పెడుతున్నట్లు రైతులలో చర్చలు జరుగుతున్నట్లు సమాచారం. అధికారులు ఈ విషయమై పర్యవేక్షణ లోపంతో సౌకర్యాలలో వ్యత్యాసం కొరత దాంతోపాటు కాటాలలో హెచ్చుతగ్గులతో ఇబ్బందులు జరుగుతున్నట్లు రైతులు తెలుపుతున్నారు. మండల పరిధిలోని కేంద్రాలలో తేమశాతం అనుకూలంగా వచ్చిన క్రమ పద్ధతిలో సీరియల్ ప్రకారం కాటా వేయకుండా నచ్చిన వారికి ఇష్టం వచ్చినట్లు ఇష్టం వచ్చినవారికి ధాన్యం కాటాలు వేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నవి. ఐకెపి, పిఎసిఎస్, మెప్మా, డీసీఎంఎస్, వ్యవసాయ శాఖఅధికారులు సంబంధిత శాఖల అధికారుల పర్యవేక్షణ లోపంతో రైతుల ఇబ్బందులు పడుతున్నట్లు తెలుపుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు పర్యవేక్షణ చేసి రైతులకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

# మూగపోయిన గర్జించిన గొంతుక

(మొదటిపేజీ తరువాయి)

ఉంది. బొగ్గు గని కార్మికుల కోసం ప్రజా గాయకుడు గద్దర్ చేపట్టిన యాత్రలో భాగంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో జరిగిన పలు సభలలో పాల్గొన్నారు. కొత్తగూడెంలో జరిగిన బాలోత్సవ్‌కు అందెశ్రీ హాజరయ్యారు. పలు అవార్డులు, రివార్డులు అందుకున్న అందెశ్రీ సమాజ మార్పు కోసం, ఆర్థిక అసమానతలు లేని వ్యవస్థ కోసం పరితపించాడు. అక్షరం దిద్దినవాడు సమాజానికి జ్ఞానం కలిగించే ప్రయత్నం చేస్తూ కన్నమూశాడు. 64 ఏళ్ల పాటు జీవించిన అందెశ్రీ ఓ తరం స్వరమై కార్య సాధనలో చిందులు వేయించాడు. అందెశ్రీ భౌతికంగా మన మధ్య లేకపోవచ్చు కానీ మన దైనందిన జీవింలో ఏదో ఒక సమయంలో ఆయన కూర్చిన పద బంధం గుర్తుకు వస్తూనే ఉంటుంది. జయ జయయే తెలంగాణ నిత్యం పాడుకుంటూనే ఉంటాం. అందుకే ప్రజా కవి, సహజ కవి అందెశ్రీ అమరుడు.

# ముగిసిన కబడ్డీ పోటీలు






**ప్రజాపక్షం/పినపాక:** ఏడూళ్ళబయ్యారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత మూడు రోజులుగా జరిగిన అండర్ 17 రాష్ట్ర స్థాయి బాల బాలికల కబడ్డీ పోటీలు సోమవారం అట్టహాసంగా ముగిశాయి. బాలికల విభాగంలో ఖమ్మం జట్టు, బాలుర విభాగాల్లో హైదరాబాద్ జట్లు విజేతలుగా నిలిచాయి. చివరి రోజున ఫైనల్స్ పోటీలు నువ్వా నేనా అనట్టు హోరాహోరీగా పోటీ కొనసాగింది. బాలికల విభాగంలో నల్గొండ, ఖమ్మం జిల్లాల క్రీడాకారులు పోటీపడ్డారు. చివరకు ఖమ్మం జిల్లా విన్నర్‌గా, నల్లగొండ జిల్లా క్రీడాకారులు రన్నర్‌గా నిలిచారు. బాలుర విభాగంలో ఖమ్మం, హైదరాబాద్ జిల్లాలు తలపడ్డాయి. హైదరాబాద్ జిల్లా విన్నర్‌గా, ఖమ్మం రన్నర్‌గా నిలిచాయి. అభిమానులు గ్రౌండ్‌లో కేరింతలు కొడుతూ కబడ్డీ జట్లకు మద్దతు పలికారు. అలాగే వివిధ పాఠశాలల చిన్నారులు నృత్యాలతో అలరించారు. ఈ క్రీడలకు ముఖ్యఅతిథిగా పినపాక శాసన సభ్యులు పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం ఐటీడీఏ పిఓ రాహుల్, పలు శాఖల అధికారులు హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకొని క్రీడలను ప్రారంభించారు. అనంతరం గెలుపొందిన జట్లకు షీల్డ్‌ను అందజేశారు. ఈసందర్భంగా పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడల్లో సామర్థ్యాలను మెరుగుపరుచుకుంటూ విజయకేతనాన్ని ఎగురవేయాలన్నారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని నడిపించడానికి శారీరక కార్యకలాపాల్లో విస్తృతంగా పాల్గొనాలని సూచించారు. అండర్ 17 రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలను నిర్వహించడంలో క్రీడా అధికారుల కృషిని ఆయన ప్రశంసించారు. ఈకార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, చిన్నారులు, మండల సీనియర్ నాయకులు, పెద్ద ఎత్తున క్రీడాభిమానులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## అందెశ్రీ మరణం సాహితీ లోకానికి తీరని లోటు

**ప్రజాపక్షం/పాల్వంచ :** ప్రముఖ కవి, తెలంగాణకు రాష్ట్రగీతం అందించిన అందె శ్రీ మరణం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించినదని ఎస్‌సి సెల్ రాష్ట్ర కన్వీనర్ గద్దల రమేష్ అన్నారు. ఆదివారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ జయ జయహే తెలంగాణ పాట మలిదశ ప్రత్యేక రాష్ట్ర సాధన పోరాట సమయంలో యావత్తు తెలంగాణ ప్రజల్ని ఊపేసిందన్నారు. అందెశ్రీ రచించిన గీతం తెలంగాణ ప్రజల గుండె చప్పుడై మార్మోగిందన్నారు. ఎక్కడ సభలు, సమావేశాలు, నిరసనలు, ఆందోళనలు ఎక్కడ జరిగినా అదే పాట ప్రజలను ఉద్యమం వైపు మరల్చిందన్నారు. జయజయహే తెలంగాణ అంటూ మక్కోటి గొంతుకలై నినదించారని తెలిపారు. ప్రత్యేక తెలంగాణ సిద్ధించిన తరువాత ఇదే పాటను రాష్ట్ర గీతంగా చేయాలని వినతులు వచ్చినా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. చివరకు కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రజాప్రభుత్వం జయజయహే తెలంగాణ గీతాన్ని రాష్ట్ర గీతంగా ప్రకటించిన విషయాన్ని తెలిపారు. అందెశ్రీ తన గీతాలతో, పాటలతో తెలంగాణ ఉద్యమానికి ఊపిరిలూదిన వాడన్నారు. ఆయన మృతి సాహితీ లోకానికి తీరని లోటని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అందెశ్రీకి భారతరత్న ప్రకటించాలని కోరారు.అందెశ్రీ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## పదవీ విరమణ పొందిన ఉద్యోగుల బెనిఫిట్స్ చెల్లించాలి

**- నేడు నిరసనదీక్ష , ధర్నా**

**ప్రజాపక్షం/భద్రాచలం :** 2024 సం.లో పదవీవిరమణ పొందిన అన్నిశాఖల ఉద్యోగులు, ఉపాధ్యాయులకు రావాల్సిన బెనిఫిట్స్ వెంటనే విడుదల చేయాలని కోరుతూ ఆల్ ఫెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్, భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి ఒక్క రోజు నిరసన కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ఆ అసోసియేషన్ నాయకులు చల్లగుల్ల నాగేశ్వరరావు, బంధు వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పదివీ విరమణ పొందిన ఉద్యోగులపై చిన్న చూపు చూస్తోందని, అనేక సం.లపాటు ప్రభుత్వ కార్యకలాపాల విజయవంతానికి, ప్రభుత్వ ప్రతిష్టను కాపాడటానికి విధులు నిర్వహించి పదవీ విరమణ పొందనవారికి రావాల్సిన బెనిఫిట్స్ ఇప్పటికి కూడా ఇవ్వకపోవడం మంచిపద్ధతి కాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆలోచన చేసి వయోభారంతో ఉన్న వారికి రావాల్సిన అన్ని రకాల బెన్ఫిట్స్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉదయం 10 గం.ల వరకు ప్రారంభమయ్యే నిరసన కార్యక్రమానికి రిటైర్డ్ ఉద్యోగులు హాజరై జయప్రథం చేయాలని కోరారు.

# ఆదర్శ కమ్యూనిస్టు సుగుణమ్మ

## సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం



**ప్రజాపక్షం/చింతకాని :** నాగులవంచ గ్రామానికి చెందిన వంకాయలపాటి సుగుణమ్మ బ్రతికినంత కాలం ఎర్రజెండానీడన ఆదర్శ కమ్యునిస్టు గా బ్రతికిందని సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు పేర్కొన్నారు. తెలంగాణ సాయుధపోరాట యోధురాలు, సిపిఐ సీనియర్ సభ్యురాలు వంకాయలపాటి సుగుణమ్మ(92) ఆదివారం మరణించిన విషయం విదితమే. సోమవారం ఉదయం సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు నాగులవంచలో సుగుణమ్మ మృతదేహాన్ని సందర్శించి అరుణపతాకాన్ని ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ సుగుణమ్మ జాతీయ మహిళా సమాఖ్య ఖమ్మం జిల్లా నాయకురాలిగా రెండు దశాబ్దాల పాటు వివిధ హోదాల్లో పనిచేశారని, కడ వరకు కమ్యునిస్టు పార్టీ సభ్యురాలిగా కొనసాగరన్నారు. నేటి తరం సుగుణమ్మ ను ఆదర్శంగా తీసుకుని ప్రజాఉద్యమాలు చేపట్టాలన్నారు. నివాళుర్పించిన వారిలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు కొండపర్తి గోవిందరావు, సింగు నర్సింహారావు, ఏపూరి రవీంద్రబాబు, పావులూరి మల్లిఖార్జునరావు, సిపిఐ మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, నాయకులు ఆళ్ళ రవీందర్, తాళ్లూరి యాదగిరి, గుడిపుడి మాధవరావు, కొత్తపల్లి రమేష్, శాఖ కార్యదర్శి బైరబోయిన హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

# దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

## -ప్రజల నుంచి అర్జీలను స్వీకరించిన కలెక్టర్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అదనపు కలెక్టర్లు పి. శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి లతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఎర్రుపాలెం మండలం రేమిడిచర్ల గ్రామానికి చెందిన గరికపాటి సరోజిని తనకు రెండవ లిస్టులో ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేశారు. ఖమ్మం నగరం పంపింగ్ వెల్ రోడ్డుకు చెందిన కొండి రేఖ తాను ఇంటర్ చదివానని కంప్యూటర్ కోర్సు చేసినట్లు అవుట్ సోర్సింగ్‌లో ఏదైనా ఉద్యోగం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేశారు. ఖమ్మం రూరల్ మండలం ఎం. వెంకటాయపాలెం గ్రామం సర్వే నెం. 396లో స్మశానవాటిక స్థల పరిష్కారం కోరుతూ కుల వివక్ష పోరాట సంఘం ఖమ్మం జిల్లా కమిటీ దరఖాస్తు చేశారు. ఏన్కూరు మండలం ఏన్కూరు గ్రామానికి చెందిన నున్నా సావిత్రి తన భర్త నున్నా వెంకయ్య పేరున ఉన్న వ్యవసాయ భూమి తనకు తెలియకుండా ఇతరుల పేర పట్టా చేశారని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని తనకు భూమి అప్పగించాలని కోరుతూ దరఖాస్తు చేశారు. మధిర మండలం నాగవరప్పాడుకు చెందిన వాడకుప్పలా నాగార్జునరావు తన పొలం సర్వే పూర్తి చేసి సరి హద్దులు గుర్తించారని గట్టు రాళ్లను వేయించాలని కోరుతూ దరఖాస్తు చేశారు. నేలకొండపల్లి మండలం గువ్వలగూడెం గ్రామానికి చెందిన అమరనేని అప్పయ్య తన కుమారుల నుండి మనోవర్తి కోరుతూ దరఖాస్తు చేశారు. ఆయా దరఖాస్తులను పరిశీలించిన కలెక్టర్ సత్వరమే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్వో ఎ. పద్మశ్రీ, డిఆర్‌డివో సన్యాసయ్య, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తాం


**ప్రజాపక్షం/ మధిర :** ఆరుగాలం కష్టపడి ఎన్నో వ్యయాప్రయాసాల కోర్చి రైతులు పండించిన ప్రతి గింజా కొనుగోలు చేసేవిధంగా ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకోవటం జరుగుతుందని మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు తెలిపారు. డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క ఆదేశాలతో మార్కెట్ యార్డ్ పరిధిలోని మూడు మండలాల్లో 40కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేందుకు కావాల్సిన సామాగ్రి, ప్యాడి క్లీనర్, పట్టాలు, కాటాలు, మ్యాయచర్ మెషిన్‌లు పిఎసిఎస్ సిఇఓలకు, డ్వాక్రా సంఘాలకు అందచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ప్రభుత్వం ధ్యేయమని, డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క ఆదేశాల మేరకు మధిర మండలంలో రైతులు పండించిన వరి, మొక్కజొన్న పంటలను కొనుగోలు చేసేందుకు 40కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు, త్వరలోనే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతులు పండించిన



పంటను కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ సెక్రటరీ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# అందెశ్రీ మరణం పట్ల చంద్రావతి సంతాపం

**ప్రజాపక్షం/వైరా:**



అక్షర జ్వాలలతో కవితల కాంతి ఆరి పోదు. ప్రజల హృదయాల్లో డాక్టర్ అందెశ్రీ పదాలు ఎప్పుడూ వెలుగుతూనే ఉంటాయి. ఆయన కవిత్వం జనం ఊపిరి. ఆ స్వరం నిశ్శబ్దమైన ప్రతిధ్వని శాశ్వతం. తెలుగు సాహితి ఆకాశంలో ఒక తార మసిలిపోయింది. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ధైర్యం ప్రసాదించాలని ప్రార్థిస్తున్నానని వైరా మాజీ శాసనసభ్యులు బానోతు చంద్రావతి తెలిపారు.

## సమీకృత మార్కెట్‌లో

# నాన్‌వెజ్ షాపులు ప్రారంభం





**ప్రజాపక్షం/మధిర :** మధిర పట్టణంలోని సమీకృత కూరగాయల మార్కెట్ నందు సోమవారం నూతనంగా నిర్మించిన నాన్‌వెజ్ షాపులను మధిర పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మిరియాల రమణగుప్తా, సీనియర్ నాయకులు పాటిబండ్ల సత్యంబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతో కాలం రోడ్ల పక్క నాన్‌వెజ్ షాపులు పెట్టుకుని ఇబ్బంది పడుతున్న వారికి డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క ప్రత్యేక చొరవ చూపి సమీకృత కూరగాయల మార్కెట్ నందు శాశ్వతంగా నాన్‌వెజ్ మార్కెట కోసం షాపులు ఏర్పాటు చేయించారని తెలిపారు. శాశ్వత పరిష్కారం చూపిన భట్టివిక్రమార్కకు నాన్ వెజ్ షాపుల యజమానులు ఆనందం వ్యక్తం చేస్తూ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తలుపుల వెంకటేశ్వర్లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ షన్ను, పట్టణ ఐఎన్‌టియుసి అధ్యక్షులు షేక్.బాజీ తదితరులు పాల్గొన్నారు.

# కరాటేలో రైజింగ్‌కిడ్స్ విద్యార్థుల ప్రతిభ




**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని వరంగల్‌క్రాస్‌రోడ్‌లోని శ్రీరామ్ నగర్‌లో గల రైజింగ్‌కిడ్స్ విద్యార్థులు కరాటేలో ప్రతిభ చేశారు. ఆదివారం వరంగల్‌జిల్లాలోని వరంగల్‌భద్రకాళి సెంటర్‌లో వరల్డ్ ఫంకోషి శాటకోన్ కరాటే ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఛాంపియన్‌షిప్ పోటీలలో సాధించారు. ఇందులో రైజింగ్‌కిడ్స్ విద్యార్థులు 10గోల్డ్‌మెడల్స్, 4సిల్వర్‌మెడల్స్, 5కాంస్య పతకాలను కైవసం చేసుకుని సత్తాచాటుకున్నారు. వీరిని ప్రిన్సిపాల్ ప్రదీప్‌తో పాటు టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం




**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురంమున్సిపాలిటీ పరిధిలోని గుదిమల్లలో మార్క్‌ఫేడ్ ఆధ్వర్యంలో మొక్కజోన్నల కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. దీనిని మద్దుపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ బైరుహరినాథ్‌బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యి రిబ్బన్‌కట్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రానేరు యాదగిరి, పేరం శ్రీను, వెంకటేశ్వర్లు, చిన్నబోయిన వెంకటనారాయణ, కందుకూరి వెంకటనారాయణ, సంఘాని వెంకటేష్, తమ్మిశెట్టి గోపయ్య, పటేరు వెంకటేశ్వర్లు, సామినేని తిరుపయ్య, మార్కోఫేడ్, వ్యవసాయశాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# శతాబ్ది ఉత్సవాల ముగింపు సభకు భారీగా తరలి రావాలి




**ప్రజాపక్షం/చింతకాని :** డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభకు ప్రతి ఒక్కరూ తరలి రావాలని సిపిఐ చింతకాని మండల కార్యదర్శి దూసరి గోపాలరావు కోరారు. శతాబ్ది ఉత్సవాల ముగింపు సభ ప్రచారంలో భాగంగా సోమవారం చింతకాని మండలంలోని లచ్చగూడెం గ్రామ శాఖ ఆధ్వర్యంలో వాల్ పెయింటింగ్ ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా దూసరి గోపాలరావు మాట్లాడుతూ పార్టీ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభ ఖమ్మంలో జరగటం చాలా అదృష్టం అన్నారు. ఈ సభకు దేశం నలుమూలల నుంచి ప్రతినిధులు వస్తున్నారని ఈ సభకు ఊరూ వాడ తరలి రావాలన్నారు. గ్రామాల్లో ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రతి ఒక్కరిని ఈ సభకు వచ్చే విధంగా ఉత్తేజపరచాలన్నారు. కవాతు దళాలను, మహిళలను, రెడ్ షర్ట్ వాలింటర్లను చింతకాని మండలం నుంచి భారీగా తరలించాలన్నారు. పార్టీ వందేళ్ల పండుగను ప్రతి ఇంటి పండుగగా భావించి , గ్రామాల్లో వాల్‌రైటింగ్ , ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. చింతకాని మండలం నుంచి 5వేలకు తగ్గకుండా తరలి వచ్చే విధంగా ఏర్పాట్లు చేస్తు న్నామన్నారు. కార్యక్రమంలో శాఖ కార్యదర్శి నరేష్, బూడిగ భిక్షం, వెంకట్రావు పాల్గొన్నారు.

# 23న కళాకారుల వన సమారాధన



**ప్రజాపక్షం/ మధిర :** ఖమ్మం జిల్లా మధిర మండలం మాటూరుపేట శ్రీ సీతారామాంజనేయ కళాపరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 23న మధిరర మండలం ఆత్కూరు గ్రామంలోని అబ్బూరి రామకృష్ణ మామిడి తోటలో ఖమ్మం కొత్తగూడెం జిల్లాల స్థాయి కళాకారుల వన సమారాధన ఏర్పాటు చేసినట్లు కళాపరిషత్ గౌరవాధ్యక్షులు పుతుంబాక శ్రీ కృష్ణప్రసాద్, అధ్యక్షులు గడ్డం సుబ్బారావు తెలిపారు. సోమవారం బంజారాకాలనీ వెంకటేశ్వస్వామి కళ్యాణ మండపంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ 2014న శ్రీ సీతారామాంజనేయ కళాపరిషత్‌ను ఏర్పాటు చేసి అప్పటి నుండి నేటి వరకు ప్రతి సంవత్సరం కళాకారులకు వన సమారాధన, నాటక పోటీలు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. వన సమారాధనకు రెండు జిల్లాల్లో ఉన్న కళాకారులందరూ హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

# ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రతిభ



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంరూరల్ మండలంలోని జిల్లాపరిషత్ ప్రభుత్వ పాఠశాలలో సోమవారం నిర్వహించిన మండల స్థాయి పోటీలలో విద్యార్థులు ప్రతిభ చాటారు. వ్యాసరచనపోటీలలో జిల్లాపరిషత్ జలగంనగర్ ప్రథమస్థానం, జిల్లాపరిషత్ మంగళగూడెం ద్వితీయస్థానం, జిల్లాపరిషత్ ఎంవీ, పాలెం తృతీయస్థానం, వ్యక్తిత్వ పోటీలలో ఎంవీ, పాలెం ప్రథామస్థానం, జిల్లాపరిషత్ జలగంనగర్ ద్వితీయస్థానం, జిల్లాపరిషత్ గుదిమళ్ల తృతీయస్థానం, క్విజ్‌పోటీలలో జిల్లాపరిషత్ జలగంనగర్ ప్రథమస్థానం, జిల్లాపరిషత్ ఏదులాపురం ద్వితీయస్థానాలను సాధించాయి. ఈ సందర్భంగా ఆయా పాఠశాలలో ఆధ్వర్యంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని, విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినీలు అభినందించారు.

## ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించొద్దు



ప్రజాపక్షం/జూలూరుపాడు: రాష్ట్రీయ రహదారి పక్కన పత్తి లోడుతో వచ్చిన వాహనాలు ట్రాఫిక్ కి అంతరాయం కలగకుండా జాగ్రత్తలు పాటించాలని మండల కేంద్రంలోని పత్తి మార్కెట్ వ్యాపారులకు సబ్ ఇన్స్పెక్టర్ బాదావత్ రవి సూచించారు. మండల కేంద్రంలోని పత్తి మార్కెట్ పరిసర ప్రాంతాన్ని సోమవారం ఎస్సై రవి ఆకస్మికంగా సందర్శించారు. పత్తి కొనుగోలు ప్రాంతంలో మార్కెట్ వ్యాపారులతో సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడుతూ ప్రధాన రహదారి పక్కన ఉన్న పత్తి మార్కెట్ వద్ద ప్రైవేట్ వాహనాలతో రహదారి చాలా రద్దీగా ఉందని ప్రధాన రహరిపై వాహనాల రాకపోకలకు చాలా ఇబ్బందికరంగా ఉందని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రవి, పత్తి వ్యాపారులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## దారా వారి రిసెప్షన్ వేడుకకు హాజరైన దూండీ రాకేష్



ప్రజాపక్షం/వైరా: వైరా శబరి గార్డెన్స్ నందు జరిగిన దారా కృష్ణారావు శేషుకుమార్ల కుమారుడు సాయి వినీత్‌కుమార్, ఆకాంక్షల రిసెప్షన్ వేడుకకు ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ దూండీ రాకేష్ సతీసమేతంగా హాజరైన నూతన వధూవరులను ఆశీర్వదించారు. తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ ఖమ్మం జిల్లా ఇంచార్జి గ్రంధి ప్రవీణ్‌కుమార్, ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభ విద్యా కమిటీ ప్రధాన కార్యదర్శి పెనుగొండ ఉపేంద్రరావు, సిపిఐ నాయకులు మిట్టపల్లి రాఘవరావు, వాసవి క్లబ్ అధ్యక్షులు రాయల నాగేశ్వరరావు, కార్యదర్శి గొండేల రవికుమార్, కోశాధికారి మైలవరపు శ్రీనివాసరావు, బాధ్యులు కొనతం రాజారావు, తాడికొండ రాము తదితరులు పాల్గొని నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## క్రీడా సామగ్రి పంపిణీ



ప్రజాపక్షం/మధిర : ఈనెల 12, 13 తేదీల్లో మధిర టివిఎం పాఠశాలల్లో జరగనున్న ఖమ్మం జిల్లాస్థాయి పాఠశాలల వాలీబాల్ క్రీడా పోటీలకు సంబంధించి వాలీబాల్ పోల్స్, వాలీబాల్స్‌తో పాటు విజేతలకు మెమోంటోలను స్థానిక హైకేర్ హాస్పటల్‌కు చెందిన డాక్టర్ నవీన్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డిలు సోమవారం నిర్వాహకులకు అందచేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఈ పోటీల్లో ఖమ్మం జిల్లాలోని 21 మండలాల నుండి అండర్ 14, అండర్ 17 బాల, బాలిక విభాగాల్లో సుమారు 800మంది విద్యార్థులు, 100మంది వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొంటారని తెలిపారు. హైకేర్ హాస్పటల్ యజమాన్యం క్రీడాభివృద్ధికి చేసిన సహకారానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాటూరు హైస్కూల్ హెచ్‌ఎం సిహెచ్.శ్రీహరి, మధిర మంల వ్యయామ ఉపాధ్యాయులు వై.చిన్ని, జి.నర్సింహారావు, బి.చైతన్య, డాక్టర్ వై.కోటారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అన్ని దానాల్లో కన్నా అన్నదానం మిన్న



ప్రజాపక్షం/ మధిర : అన్ని దానాల్లో కన్న అన్నదానం మిన్న అని మధిర సేవా సమితి సెక్రటరీ, రిపోర్టర్ మువ్వా రామకృష్ణ అన్నారు. మధిర పట్టణంలోని ఆదరణ సేవా ఫౌండేషన్ అనాధ ఆశ్రమయంలో మధిర సేవా సమితి ఆధ్వర్యంలో మిట్టదొడ్ల నర్సింహారావు వర్ధంతి సందర్భంగా వారి కుటుంబ సభ్యులు మిట్టదొడ్ల యాదిగిరి, మిట్టదొడ్ల శివకృష్ణ ఆర్థిక సహకారంతో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయటం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ అనాధుల పట్ల సేవా భావం కలిగి ఉండాలని తెలిపారు. అనాధలకు సేవలందించటంలో మధిర సేవా సమితి ఎప్పుడూ ముందుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పల్లపోతు ప్రసాదరావు, కుంచం కృష్ణారావు, సామినేని రామనాథం, వందనపు శ్రీనివాసరావు, దాచేపల్లి ముత్యాలు, దొడ్డ శ్రీనివాసరావు, బత్తుల శ్రీనివాసరావు, గాలి ప్రసాద్, జిల్లా రాధాకృష్ణమూర్తి, వట్టే సైదులు తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాపక్షం/ములకలపల్లి: ములకలపల్లి మండలం కొత్తగంగారంలో గత కొన్ని రోజులుగా భిక్షాటన చేస్తూ జీవిస్తున్న గుర్తు తెలియన వ్యక్తి సోమవారం మృతి చెందారు. మృతుడు వయసు సుమారు 60 సంవత్సరాలు ఉంటుంది. పాల్వంచ ప్రాంతాల నుండి వచ్చినట్లు సమాచారం, గుర్తించిన వారు ములకలపల్లి పోలీసులను 8712682058 సంప్రదించాలని ఎస్ఐ మధుప్రసాద్ తెలిపారు.

# మణుగూరులో మెగా జాబ్‌మేళా

**నిరుద్యోగ యువత అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి**
**పినపాక ఎమ్మెల్యే పాయం, ఏరియా జిఎం దుర్గం రాంచందర్**





ప్రజాపక్షం/మణుగూరు: నిరుద్యోగ యువత మెగా జాబ్ మేళా అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, మణుగూరు ఏరియా జిఎం దుర్గం రాంచందర్‌లు అన్నారు. సోమవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈనెల 19వ తేదీన మణుగూరు ఏరియా పీవీ కాలనీ భద్రాద్రి స్టేడియంలో మల్టీ నేషనల్ కంపెనీలు, కంపెనీలు మొత్తం వంద కంపెనీలు జాబ్ మేళాకు వస్తున్నాయన్నారు. జాబ్ మేళాలో నాలుగు వేలకు పైగా అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. తెలంగాణ రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కల ఆలోచనలతో సింగరేణి సహకారంతో జాబ్ మేళాను నిర్వహించడం జరుగుతుందన్నారు. సింగరేణి సీ అండ్ ఎండి బలరాంను కలిసి విషయం చెప్పగానే వెంటనే స్పందించి మణుగూరులో జాబ్ మేళా నిర్వహించేందుకు ఒప్పు కోవడం జరిగిందన్నారు. జాబ్ మేళా ఒక అద్భుతమైన కార్యక్రమం అని చాలా ఆనందంగా సంతోషంగా ఉందన్నారు. ఏజెన్సీ ప్రాంతమైన పినపాక నియోజకవర్గంలోని ఏడు మండలాల నిరుద్యోగులతో పాటు ఇతర ప్రాంతాల నిరుద్యోగులు ఈ అరుదైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని చక్కటి ఉపాధి అవకాశాలు పొందాలన్నారు. 19వ తేదీన ఉదయం 8 గంటల 30 నిమిషాల నుండి సాయంత్రం 5 గంటల వరకు జాబ్ మేళా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. అన్ని శాఖల సహకారంతో జాబ్ మేళా విజయవంతానికి వివిధ రకాలుగా ప్రచారం నిర్వహించడం జరుగుతుందన్నారు. 18 సంవత్సరాల వయసు నుండి 40 సంవత్సరాల వయసు ఉన్నవారు జాబ్ మేళాకు హాజరు కావచ్చని, దివ్యాంగులకు కూడా అవకాశం కల్పించడం జరుగుతుందన్నారు. పదో తరగతి నుండి ఆపై చదువు చదివిన వారికి, ఐటిఐ వారు జాబ్ మేళాకు హాజరు కావాలన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు కష్టపడే అవసరం లేకుండా పోస్టర్లపై స్కానర్‌ను ఏర్పాటు చేశారని స్కాన్ చేయగానే అప్లికేషన్ ఓపెన్ అవుతుందని అందులో వివరాలన్నీ పూర్తి చేసి ఓకే చేస్తే రిజిస్ట్రేషన్ అవుతుందన్నారు. సింగరేణి సంస్థ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు జాబ్ మేళా కార్యక్రమాలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. నిరుద్యోగులు తమ టాలెంటును ప్రూఫ్ చేసుకొని ఉపాధి అవకాశాలు పొందాలన్నారు. జాబ్ మేళాకు వచ్చే నిరుద్యోగులకు సింగరేణి ఆధ్వర్యంలో భోజన ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. జాబ్ మేళా కార్యక్రమం విజయవంతానికి సింగరేణి సంస్థ అన్ని ఏర్పాట్లు చేస్తుందని ఆయన తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో మణుగూరు ఏరియా ఎస్వోటూ జీఎం శ్రీనివాస చారి, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎంపీఓ వెంకటేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావు, డీజీఎం పర్సనల్ రమేష్, రామయ్య, కాంగ్రెస్ పార్టీమణుగూరు మండల, పట్టణ అధ్యక్షులు పీరినాకి నవీన్, శివ సైదులు, ఇక్బాల్ హుస్సేన్, తరుణ్ రెడ్డి, రహీం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మెగా జాబ్ మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు.

# మిర్చి తోటకు వేరు తెగులు..!

**తెగులు నివారించలేక ట్రాక్టర్‌తో మొక్కలు తొలగింపు**





ప్రజాపక్షం/జూలూరుపాడు: ఎన్నో ఆశలతో సాగు చేసిన మిరప తోట కళ్ళముందే నాశనమవుతుంటే ఆ రైతు కంటనీరు పెడుతున్నాడు. వేలకు వేలు ఖర్చు పెట్టి సేద్యం చేసిన పైరును వేరు తెగులు పీల్చి పిప్పి చేస్తుంటే ఏమీ చేయలేక నిస్సహాయ స్థితిలో రైతు తన చేతులతో మొక్కలను తానే తుంచేస్తున్నాడు. ఎంత కష్టపడి సాగు చేసినా శత్రువు రూపంలో మొక్కలను వేరు తెగులు సోకి పంటను సర్వనాశనం చేస్తుంటే రైతు కన్నీరుమున్నీరవుతున్నాడు. జూలూరుపాడు మండలంలోని గంగారం తండా నివాసి మాలోత్ పాపారావు అనే రైతు తనకున్న ఐదు ఎకరాల మిరప పంటను ట్రాక్టర్‌తో దున్ని తొలగించారు. బాధిత రైతుల కథనం ప్రకారం.... గంగారం తండా గ్రామానికి చెందిన పాపారావు తమ ఐదు ఎకరాల భూమిలో మిర్చి సాగు చేశారు. నాలుగు ఎకరాల్లో సన్న రకం మిర్చిని వేశారు. అయితే మూడు నెలల్లోనే పంటకు వైరస్ సోకడంతో పూత, కాత రాలేదు. పలు రకాల పురుగు మందులు పిచికారీ చేసినా లాభం లేకపోవడంతో చివరకు ట్రాక్టర్‌తో దున్ని పంటను తొలగించారు. వేరు తెగులు నుంచి మిర్చి పంటను కాపాడుకోవడం కష్టమని భావించి పంటను తొలగిస్తున్నట్లు రైతు పాపారావు వాపోయాడు. పంట సాగుచేసిన నాటి నుంచి సుమారు రూ.3 లక్షల వరకు పెట్టుబడి పెట్టానని రైతు తెలిపారు.

## పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిమ్ ఏర్పాటు




ప్రజాపక్షం/పాల్వంచ : పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పూర్వ విద్యార్థుల సహకారంతో ఏర్పాటు చేసిన జిమ్‌ను రిటైర్డ్ ప్రిన్సిపాల్ నర్సింహ సోమవారం ప్రారంభించారు. ఈ ఆసంధర్భంగా ఆయన మాట్లాడుతూ పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధిలో పూర్వ విద్యార్థి సంఘం కీలకంగా పనిచేస్తుందన్నారు.చదువుకున్న కళాశాల రుణం తీర్చుకొనేందుకు చేస్తున్న కృషిని అభినందించారు. ఎల్లవేళలా కళాశాల అభివృద్ధికి తోడ్పాటునందించాలని కోరారు. అనంతరం ప్రిన్సిపాల్ పద్మ మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు న్యాక్ ఏగ్రేడ్ రావటానికి పూర్వ విద్యార్థుల కృషి విలువైనదన్నారు. ప్రవేటు కళాశాలలకు ధీటుగా అత్యధికంగా అడ్మిషన్‌లు చేసి ఆదర్శంగా నిలిపామని తెలిపారు. కళాశాలలో అపరిష్కృతంగా ఉన్నటువంటి సమస్యల పరిష్కారానికి పూర్వ విద్యార్థులు అండగా నిలవాలని కోరారు. విద్యార్థులకు చదువుతో పాటు వ్యాయామం కూడా అవసరమేనని పాల్వంచ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు పసునూరి రమేష్ అన్నారు. గత సంవత్సరం రూ. 1.80 వేలతో కుర్చీలు అందజేశామన్నారు. అడగగానే సహాయ సహకారాలు అందించిన పూర్వ విద్యార్థులకు ప్రత్యేక దన్యవాదములు తెలిపారు. భవిష్యత్‌లో కూడా కళాశాల అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థి సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షులు ఎర్రపాటి క్రిష్ణ, వెంకట్, నాగేశ్వరరావు, కుర్మా విజయరావు, మాధవి, పావని, రాధిక, కళాశాల ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కస్తూరిబా బాలికల విద్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్

**వంట సిబ్బందిని ప్రశంసించిన కలెక్టర్**







ప్రజాపక్షం/జూలూరుపాడు: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను భద్రాద్రికొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదులు, భోజనశాల, వసతి గృహాలు, పాఠశాల పరిసరాలను సమగ్రంగా పరిశీలించిన కలెక్టర్ విద్యార్థులతో ప్రత్యక్షంగా ముచ్చటించారు. వసతి సౌకర్యాలు, పరిశుభ్రత, త్రాగు నీరు, స్నానాల గదులు వంటి అంశాలపై విద్యార్థుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఎలాంటి ఇబ్బందులు ఎదురు కాకుండా అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, విద్యార్థుల ఆరోగ్యం, భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. తరగతి గదుల్లో విద్యార్థుల చదువు, ఉపాధ్యాయుల బోధన నాణ్యత, అభ్యాస స్థాయి పై సమీక్ష నిర్వహించిన ఆయన విద్యార్థులు క్రమశిక్షణతో చదివి, ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు పాఠ్యబోధనతో పాటు, పోటీ పరీక్షల శిక్షణనూ అందించాలని మార్గనిర్దేశం చేశారు. భోజనశాల తనిఖీ సందర్భంగా ఆహార పదార్థాల నిల్వ, వంటశాల శుభ్రత, విద్యార్థులకు అందుతున్న భోజన నాణ్యతను పరిశీలించారు. తాజా పదార్థాలతో వంట చేయాలని, పోషకాహారంతోనూ రుచి కరంగానూ భోజనం ఉండేలా చూడాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం నాణ్యమైన విద్య అందించడంలో ఎలాంటి రాజీ ఉండకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. కేజీబీవీ పాఠశాలలలో విద్యార్థినిలను చదివిస్తున్న తల్లిదండ్రులను అభినందించారు. పాఠశాల నిర్వహణ పట్ల కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. బాలికలు ఆటలు ఆడుకునేందుకు ప్లే గ్రౌండ్‌కు గ్రావెల్, కంప్యూటర్లు, దోమలు రాకుండా కిటికీలకు మెస్ ఏర్పాటు, ఎస్సీ హాస్టల్ నుంచి కేజీబీవీ వరకు స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేయాలని పాఠశాల ప్రిన్సిపాల్ పద్మజా, పీడీ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్ళారు. పాఠశాల సమస్యలపై నివేదికలు అందిస్తే తక్షణమే పరిష్కారం చూపుతామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

**వంట సిబ్బందిని ప్రశంసించిన కలెక్టర్...**

కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల నందు భోజనం తయారు చేసే వంట సిబ్బందిని ప్రశంసించారు. వ్యక్తిగతంగా ప్రశంసించడం ద్వారా వారు చేసే సేవకు గౌరవం చూపించారు. విద్యార్థుల కోసం ప్రతిరోజు రుచికరమైన పోషణతో కూడిన భోజనం అందించాల్సిందిగా వంట సిబ్బందిని ప్రోత్సహించారు. మధ్యాహ్నం భోజనం నిర్వహిస్తున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి కలెక్టర్ సహ పంక్తి భోజనం చేశారు. భోజనం చాలా బాగుందని ప్రశంసించారు. "ప్రతి రోజు ఇలాగే ఉంటుందా" అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్నం భోజనం నిర్వహిస్తున్న తీరుపై కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సంతృప్తి వ్యక్తం చేశారు. కలెక్టర్ తమ పాఠశాలకు రావడంపై విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది ఆనంద వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పలు అంశాలపై మాట్లాడుతూ, భవిష్యత్తులో ఏమి కావాలి అనుకుంటున్నారు అంటూ కుశల ప్రశ్నలు వేయడం జరిగింది. అంతే ఉత్సాహంతో కలెక్టర్ అడిగిన ప్రశ్నలకు విద్యార్థినీలు సమాధానం ఇవ్వడం జరిగింది. జిల్లా కలెక్టర్ వెంట తహశీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో అజయ్, ఎంపీవో తులసీరామ్, సూపరింటెండెంట్ రవి, విద్యాలయం ఎస్ఓ పద్మజ, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

# ఉచితంతో భారమైన ప్రయాణం..!

**-ఫిట్నెస్ కోల్పోతున్న బస్సులు**
**-అడుగు అడుగున ప్రమాదాలు**





ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి: అన్నపురెడ్డిపల్లి మండలంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణసౌకర్యాన్ని అందించింది. ఈ పథకం ద్వారా మహిళలు ఎంతగానో లబ్ది పొందుతున్నారని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇది ఇలా ఉండగా రోజు రోజుకు ఈ ఉచిత ప్రయాణం భారమైన ప్రయాణంగా మారుతూ భవిష్యత్తులో ఎన్నో అనర్థాలకు దారి తీసే దిశగా ఉండబోతుందని అంచనా, అదే విధంగా ఆర్టీసీ బస్సుల్లో కెపాసిటీకి మించి అధిక లోడుతో ప్రయాణికులు ప్రయాణం చేయడం వల్ల, రోజు రోజుకు బస్సుల్లో అనేక రకాల రిపేర్లు వస్తున్నాయి. ఈ విధంగా రావడం సగటున రోజు వారి ప్రయాణించే ప్రయాణికులకు సత్తుపల్లి బస్ డిపో నుండి వయా అన్నపురెడ్డిపల్లి మీదుగా పాల్వంచ వరకు తిరిగే బస్సులకు వాటి ఫిట్నెస్‌కు సరితూగటం లేదు. అధిక లోడుతో ప్రయాణించడం వల్ల బస్సులు ఎక్కడపడితే అక్కడ ఆగిపోవడం ఆలస్యంగా నడవడం జరుగుతుంది. అధిక లోడుతో బస్సులు నడవడం సత్తుపల్లి నుండి పాల్వంచకు వెళ్లే రహదారి మొత్తం గుంతలమయంతో ఉండటం వల్ల బస్సులు వాటి నాణ్యతను కోల్పోవడమే కాకుండా ఎక్కువ శాతం ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. ఏది ఏమైనప్పటికీ అవసరాలకు అనుగుణంగా అధిక లోడు కాకుండా నిర్ణీతమైన కెపాసిటిలో ప్రయాణికులను ఎక్కించుకొని గమ్యస్థానాలకు చేర్చాలని, ఎప్పటికప్పుడు గ్రామీణ ప్రాంతాలలో కొత్త బస్సులను ఏర్పాటు చేసి రానున్న రోజుల్లో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా చూసి సమయపాలన పాటిస్తూ ఆర్టీసీ బస్సులు నడిపే విధంగా చూసుకోవాలని మండల ప్రజలు కోరుకుంటున్నారు.

## కవి అందెశ్రీకి పలువురి నివాళి



ప్రజాపక్షం/ఏన్కూరు : ప్రముఖ కవి, తెలంగాణ రాష్ట్ర గీత రచయిత డాక్టర్ అందెశ్రీకి ఏన్కూరులో సోమవారం పలువురు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మరణం తెలుగు సాహితి లోకానికి తీరని లోటు అని, మాయమై పోతున్నడమ్మా మనిషన్నవాడు అనే పాటతో పాటు ఎన్నో ఉద్యమ గీతాలు రాసిన ప్రజాకవి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కొంటు సాంబయ్య, గిద్ద గిరి సత్యనారాయణ, సీనియర్ జర్నలిస్ట్ జె కృష్ణమాచారీ, దొంతబోయిన నాగేశ్వరావు, సాయి, పొట్లంపల్లి శ్రీనివాసరావు, ఇటికాల రాజు తదితరులు పాల్గొన్నారు.

## నెరవేరిన పేదవాడి సొంతింటి కల



ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి: అన్నపురెడ్డిపల్లి మండలంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పేదవాడి సొంత ఇంటి కలను ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పథకం ద్వారా సుసాధ్యం చేస్తోంది. మండలంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలు ఒక జాతరల కొనసాగుతున్నాయి. సుమారు 66 ఇండ్లను మంజూరు చేయగా ఇప్పటికే లక్ష్యాన్ని చేదింతే దిశగా ఇండ్ల నిర్మాణాలు పూర్తి కావస్తున్నాయి. ఎంతో కాలంగా ఇల్లు లేని అటువంటి నిరుపేదలు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత నిరుపేదలను గుర్తించి వారికి ఇంటి నిర్మాణం చేసుకొనడానికి 5లక్షల రూపాయలను ఆర్థిక సాయం అందించి, సొంత ఇల్లు కట్టుకొని అవకాశాన్ని కల్పించినందుకు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి



ప్రజాపక్షం/కారేపల్లి: పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని, ఈనెల 13న ఖమ్మం కలెక్టరేట్ ముందు జరిగే ధర్నా ప్రదర్శనను జయప్రదం చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం ఏఐకేఎంఎస్ ఖమ్మం జిల్లా కార్యదర్శి వై ప్రకాష్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని పేరుపల్లి గ్రామంలో ప్రచారం జనరల్ బాడీ నిర్వహించి, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం ఏఐకెఎంఎస్ జిల్లా నాయకులు కే శ్రీనివాస్‌రెడ్డి, మండల నాయకులు అలెం గురవయ్య, చంద్రయ్య, సుగుణ, వై జానకి, సత్యనారాయణ, చంద్రక్క, గురువమ్మ, కోరం గురవయ్య, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

## అమరవీరుల ఆశయాలను కొనసాగిద్దాం



ప్రజాపక్షం/కారేపల్లి: భారత విప్లవ ఉద్యమంలో అసువులు బాసిన అమరవీరుల ఆశయాలను కొనసాగిద్దామని సిపిఐ ఎంఎల్ మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి టి ఝాన్సీ అన్నారు. సిపిఐ ఎంఎల్ మాస్‌లైన్ సింగరేణి మండల కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని పంతులునాయక్ తండ గ్రామంలో భారత విప్లవ ఉద్యమంలో అమరులైన అమరవీరుల సంస్మరణ సభలు నిర్వహించారు. ఈసందర్భంగా పార్టీ పతాకాన్ని ఆమె ఆవిష్కరించారు. అనంతరం మాస్‌లైన్ మండల నాయకులు రంగ్య అధ్యక్షతన జరిగిన సభలో పాల్గొని మాట్లాడుతూ భారతదేశంలో అసమానతలు, దోపిడి, పీడన లేని రాజ్యం కోసం అనేక మంది విప్లవకారులు వారి ప్రాణాలు తృణప్రాయంగా అర్పించారని అన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు గుమ్మడి సందీప్, ఎన్వి రాకేష్, ధరావ సక్రు, రఘుపతి, శ్రీను, భాస్కర్, నాగేశ్వరరావు, రామోజీ, కొండలరావు, కౌసల్య, మంగీలాల్, తదితరులు పాల్గొన్నారు.

## కార్మికవర్గ పోరాటాలను బలోపేతం చేయాలి



ప్రజాపక్షం/ములకలపల్లి : బిజెపి ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేసేందుకు శ్రమ పాలసీ తీసుకొస్తుందని దాన్ని వెంటనే వ్యతిరేకించాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి పిట్టల అర్జున్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని రాయల్ ఫంక్షన్ హాల్ నందు జరిగిన సిఐటియు మండల మహాసభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికుల పట్ల నిర్లక్ష్యపు ధోరణిలను ఖండించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు దుబ్బాక ధనలక్ష్మి, సిఐటియు మండల కన్వీనర్ నిమ్మల మధు, సిఐటియు దమ్మపేట మండల కన్వీనర్ మురాహరి రఘు, బుగ్గ వెంకట నరసమ్మ, ఓరుగంటి శ్రీను, కేసరి జయ, చిక్కుల శ్రీను, వర్కా రుక్మాదారావు, నల్లి సుజాత, ఎస్‌కే మస్తాన్, ఉమా, ఇందిరా, వగ్గల ధారయ, కాంతి, తిరుపతమ్మ, సూరం పుల్లారావు, హలవత్ శివ, సైదమ్మ, ఎస్ఎఫ్ఐ మండల నాయకులు ముదిగొండ ప్రశాంత్ పాల్గొన్నారు.

## 'ఉల్లాస్-అమ్మకు అక్షరమాల' ప్రారంభం



ప్రజాపక్షం/కరకగూడెం: గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఆధ్వర్యంలో సోమవారం కరకగూడెం మండలం, చిరుమళ్ళ గ్రామంలో "ఉల్లాస్ అమ్మకు అక్షర మాల" విద్యా కేంద్రాన్ని వయోజన విద్యా డిప్యుటీ డైరెక్టర్ సీ.హెచ్ అనిల్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్వయం సంఘాల లోని సభ్యులు అందరు ఈ కార్యక్రమం సద్వినియోగం చేసుకొని, ఆర్థికంగా సామాజికంగా ఎదగాలన్నారు. ఈ సందర్భంగా మండల స్థాయి ఉల్లాస్ అమ్మకు అక్షర మాల కమిటీ ఆధ్వర్యంలో చిరుమల్ల గ్రామంలో విద్యా తరగతులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి మంజుల, సెర్ప్ ఎపిఎం బి. వినోద్ క్రాంతి, ఎంపివో మారుతి, జిపి కార్యదర్శి రామకృష్ణ, సీసీలు విజయలక్ష్మి, సత్యనారాయణ, వివోఏలు, పాలకవర్గ సభ్యులు, వాలంటీర్లు, సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్ సాగు లాభదాయకం : కలెక్టర్

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఆయిల్ పామ్ సాగు లాభదాయకమని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ఖమ్మం జిల్లా ఉద్యానవన, సహకార శాఖ , తెలంగాణ ఆయిల్ ఫెడ్, గోద్రెజ్ అగ్రోవెట్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం సహకార సంఘాల డైరెక్టర్లతో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆధునీకరణ, మారుతున్న సాంకేతికతను దృష్టిలో పెట్టుకుని వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చే అవగాహన రైతులకు కల్పించాలన్నారు. రైతులు వరి, వరి నుండి పత్తి, మిర్చి, కూరగాయలు సాగు చేస్తున్నట్లు, ప్రకృతి వైపరీత్యాలు, అకాల వర్షాలు, కోతులు, మీద పీడల సమస్యలతో నష్టాల పాలవుతున్నారన్నారు. వైవిధ్య పంటల వైపు రైతులు మరలడానికి రైతులు చాలా ఆలోచన చేస్తారన్నారు. నష్టం ఎట్టి పరిస్థితుల్లో సంభవించడానికి ఆస్కారం లేని పంట ఆయిల్ పామ్ అని కలెక్టర్ తెలిపారు.రైతులకు ఆయిల్ పామ్ సాగు అధిక లాభాలను కలిగిస్తుందన్నారు. ఆయిల్ పామ్ దిగుబడి ఎక్కువగా వస్తుందని మార్కెట్‌లో డిమాండ్ ఉండి మంచి రేటు వస్తుందని సమస్యలు తక్కువగా ఉంటాయని లేబర్ ఖర్చు తక్కువ అన్నారు. ఒక్కసారి పంట వేస్తే 30 ఏళ్ల పాటు కల్పతరువులా దిగుబడి ఇస్తుందన్నారు. దేశంలో 90 లక్షల మెట్రిక్ టన్నుల పైచిలుకు ఆయిల్ పామ్ ఆవశ్యకత ఉంటే ప్రస్తుతం రెండు నుంచి మూడు లక్షల మెట్రిక్ టన్నుల సాగు మాత్రమే జరుగుతుందన్నారు. ఇతర దేశాల నుంచి ఆయిల్ పామ్ దిగుమతికి యేటా రూ. 70వేల కోట్ల రూపాయలకు పైగా ఖర్చు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. రాను రాను ఆయిల్ వినియోగం రోజు రోజుకు పెరుగుతుందని డిమాండ్ ఉన్న ఆయిల్ పామ్ సాగు మంచి ఆదాయాన్ని ఇస్తుంద




న్నారు. ఆయిల్ పామ్ సాగుకు వైరా నియోజక వర్గంలో చాలా మంది రైతులు ముందుకు వస్తున్నారని తెలిపారు. సత్తుపల్లి, పాలేరు నియోజక వర్గాల్లో కొంత వెనకబడి ఉందన్నారు. వరి నుండి ఆయిల్ పామ్ సాగుకు వెళ్లేవిధంగా రైతులను చైతన్యపర్చాలన్నారు. ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగుకు ఎకరాకు రూ. 50వేల సబ్సిడీ ఇస్తుందని డ్రిప్ , ఏడాది పాటు నిర్వహణకు సహకరిస్తుందని కలెక్టర్ తెలిపారు. దిగుబడి నాల్గవ సంవత్సరం నుంచి వస్తుందని అప్పటి వరకు అంతర పంటల ద్వారా ఆదాయం పొందవచ్చునని తెలిపారు. జిల్లాకు ఈ సంవత్సరం 14,500 ఎకరాల ఆయిల్ పామ్ సాగు లక్ష్యాన్ని ప్రభుత్వం ఇచ్చిందని ఇప్పటి వరకు 7వేలు పైచిలుకు లక్ష్యం సాధించినట్లు తెలిపారు. ప్రతి సహకార సంఘం డైరెక్టర్ 100 ఎకరాల ఆయిల్ పామ్ సాగు లక్ష్యంగా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన అధికారి మధుసూదన్, డిసిఓ గంగాధర్, సహకార సంఘాల డైరెక్టర్లు, ఉద్యాన, సహకార శాఖాధికారులు, తెలంగాణ ఆయిల్ ఫెడ్, గోద్రెజ్ అగ్రోవెట్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ప్రజాపక్షం/వైరా: వైరా మండలం గరికపాడు, దాచాపురం ధాన్యం కొనుగోలు కేంద్రాలను వైరా డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్ మట్టూరి కోటేశ్వరరావు, సొసైటీ చైర్మన్ కృష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు పూర్తిగా ఆరబెట్టిన ధాన్యాన్ని మిల్లులకు పంపాల్సిందిగా రైతులకు తెలియజేశారు. గన్నీ సంచులు అందుబాటులో ఉంచుకోవాలని సొసైటీ వారికి చెప్పారు. ఈ



కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మంజుఖాన్, వ్యవసాయ విస్తరణ అధికారి సైదులు, సొసైటీ సీఈవో అంజయ్య, సొసైటీ డైరెక్టర్లు, అదేవిధంగా సిబ్బంది, రైతులు పాల్గొనడం జరిగింది. విత్తన మొక్కజొన్న మీద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గరికపాడు, లింగన్నపాలెం గ్రామంలో విత్తన మొక్కజొన్న వేసే రైతులకు అగ్రిమెంటు లేకుండా కంపెనీ వారు ఇచ్చే మొక్కజొన్నని వేయకూడదని సూచించడం జరిగింది. అగ్రిమెంటు ఉంటేనే మొక్కజొన్న వేసేలా రైతులకు తెలియజేశారు. రైతులకు నష్టం రాకుండా అగ్రిమెంటు తీసుకొని విత్తన మొక్కజొన్న వేసుకోవాలని ఆత్మ కమిటీ చైర్మన్, మండల వ్యవసాయ అధికారి తెలియజేశారు.

# అందెశ్రీ మృతిపట్ల వికాస వేదిక సంతాపం

ప్రజాపక్షం/ ఖమ్మం : సమాజహితం, ప్రజా చైతన్యమే లక్ష్యంగా కలాన్ని, గళాన్ని ఝుళిపించిన ప్రజాకవి అందెశ్రీ మృతిపట్ల వికాస వేదిక సాహిత్య సంస్థ తీవ్ర సంతాపాన్ని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేసింది. అందెశ్రీ మృతితో తెలుగు సాహిత్య రంగం ఒక అభ్యుదయ కవిని కోల్పోయిందన్నారు. సంతాపం తెలియజేసిన వారిలో వికాస వేదిక సాహిత్య సంస్థ రాష్ట్ర అధ్యక్షులు సాధనాల వెంకటస్వామినాయుడు, ప్రధాన కార్యదర్శి లెనిన్ శ్రీనివాస్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గజల భారతి, తిరునగరి శ్రీనివాస్, సంస్థ బాధ్యులు బుక్క సత్యనారాయణ, కాంతేశ్వరరావు, నర్సింహాచారి తదితరులు ఉన్నారు.



# కార్మికుల సమస్యల పరిష్కారానికి జేఏసి కృషి


ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారానికి జేఏసి ఆధ్వర్యంలో కృషి చేస్తామని జేఏసి చైర్మన్ పిట్టల మల్లయ్య తెలిపారు. సోమవారం జేఏసి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని కలిసి గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం సమర్పించారు. గ్రామ పంచాయతీలలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, సిబ్బంది వేతనాలు, మల్టీ పర్పస్ విధానం రద్దు, కరోనా సమయంలో రూ. 10వేలు రాని వారికి అందించాలని, గ్రామ పంచాయతీ సిబ్బంది చనిపోయినచో రూ. 10 లక్షలు ఇన్సూరెన్స్ ఇవ్వాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని జేఏసి నాయకులు కలెక్టర్‌ను కోరారు. స్పందించిన కలెక్టర్ ఇట్టి విషయాలను పంచాయతీరాజ్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేదుకు కృషి చేస్తామన్నారు. అనంతరం జరిగిన జిల్లా జేఏసి కమిటీ సమావేశంలో జేఏసి చైర్మన్ పిట్టల మల్లయ్య మాట్లాడుతూ గ్రామ పంచాయతీ సిబ్బంది సమస్యలను పరిష్కరించే వరకు జేఏసి కమిటీ కొనసాగుతుందని తెలిపారు. పంచాయతీ సిబ్బంది సమస్యలు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా కమిటీ కృషి



చేస్తుందన్నారు. కమిటీ సభ్యులు ప్రతి ఒక్కరూ సమస్యలపై పోరాడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి మేకల మల్లికార్జున్, వైస్ ఛైర్మన్ కొప్పుల నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శులు జాలా రామయ్య, బొగ్గుల కృష్ణారెడ్డి, నాగేశ్వరరావు, కంపాటి మహేష్, ప్రచార కార్యదర్శి జిడుగు నాగేశ్వరరావు, నాయకులు జి. రాందాస్, బి. మంగీలాల్, రమేష్, వెంకటకృష్ణ, అనుముల మహేందర్, నెల్లూరు ప్రదీప్, డి. శ్రీనివాసరెడ్డి, ఎం. రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాపక్షం/ ముదిగొండ: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన ముదిగొండ మండల పరిధిలోని వల్లభి, బాణాపురం మధ్య జరిగింది. ఎన్‌టిఆర్ కృష్ణా జిల్లా జగ్గయ్యపేట మండలం గండ్రాయికి చెందిన రాయల కుమార్ (35) మోటార్ సైకిల్ మీద ప్రయాణిస్తున్న సమయంలో అదుపుతప్పి కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. గాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య, రెండేళ్ల కుమార్తె ఉన్నారు.



# అదుపుతప్పి బైక్ పల్టీ.. వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాపక్షం/వైరా: బైక్ అదుపుతప్పి తీవ్ర గాయాలైన సంఘటన వైరా మున్సిపాలిటీ పరిధిలోని గండగలపాడు గ్రామ సమీపంలో ఉన్న సాయిబాబా గుడి వద్ద ప్రమాదం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే బైక్‌పై వ్యక్తి పూనే నుంచి ఒరిస్సా రాష్ట్రంలో తన స్వగ్రామానికి సౌరబ్ మహంతి(22) అనే వ్యక్తి ప్రయాణిస్తుండగా వైరా సమీపంలో సాయిబాబా గుడి వద్దకు



రాగానే ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పి రోడ్డు ప్రక్కన ఉన్న గుంటలో పడటంతో బైక్‌పై ప్రయాణిస్తున్న వ్యక్తికి తీవ్ర గాయాలు కావడంతో తనతో పాటు ఉన్న మరో బైక్‌పై ప్రయాణిస్తున్న వ్యక్తి, స్థానికులతో కలిసి స్థానిక ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స చేసి అనంతరం మెరుగైన చికిత్స కోసం 108 ద్వారా ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# వైరా మున్సిపాలిటీల్లో పారిశుద్ధ్య కార్మికుల పట్ల నిర్లక్ష్యం తగదు

ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీలో శానిటైజర్ వర్కర్లుగా పనిచేస్తున్న వారికి నెలలు గడుస్తున్నా ఇంతవరకు జీతాలు చేయకుండా కార్మికుల జీతాల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న మున్సిపాల్ మేనేజర్ సుధాకర్ రావు, వైరా మున్సిపాలిటీలో మున్సిపాలిటీ అధికారులు మొత్తం మున్సిపాలిటీ శానిటైజర్ వర్కర్లకి జీతాల మీద సీతకాలు చేసిన సుధాకర్ మాత్రం సంతకాలు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తూ ఆ జీతాలు వస్తే ఏంటి నిదానంగా చేస్తాం అంత తొందరేముది అంటూ నిర్లక్ష్య సమాధానం కార్మికులకు అడిగితే చెబు



**నెలలు గడుస్తున్నా జీతాలు ఇవ్వని వైనం**

తున్నారు. అలాగే మిమ్మల్ని ఎవరు అడగమంటున్నారు. నాకు తెలుసు అంటూ ఒక నియంతలాగా ప్రవర్తిస్తున్నారు. కార్మికులు ప్రతిరోజు ఉదయం నుండి సాయంత్రం వరకు చెత్తాచెదారాలు ఎత్తివేసి కడుపు మార్చుకొని పనిచేస్తున్న కాని నెల నెల జీతాలు ఇవ్వడంలో మేనేజర్ నిర్లక్ష్యం చూపుతూ జీతాలు చేయకుండా సంతకాలు పెట్టకుండా వెళ్లడం తనకే చెల్లుబాటు మున్సిపాలిటీ కమిషనర్ మిగతా అధికారులు మొత్తం జీతాల చెక్కులు మీద సంతకాలు చేసి పది రోజులు అవుతున్న ఒక్క మేనేజర్ సతకం కోసం పది రోజుల నుండి ఎదురుచూడాల్సి వస్తుంది. ఇంతవరకు సంతకాలు చేయకుండా ఏదో కుంటి సాకులు చెబుతున్నాడు. ఇలాంటి వారిపై అధికారులు చర్యలు తీసుకొని కార్మికులకు జీతాలు వెంటనే వేయించాలని సిపిఐ మండల కార్యదర్శి యామాల గోపాలరావు అన్నారు.

# ఎంబిబిఎస్ సీటు సాధించిన జశ్విన్‌కు సన్మానం



ప్రజాపక్షం/వైరా: వైరా శాంతినగర్‌కు చెందిన ఆదూరి ప్రేమ్ కుమార్ తనయుడు జశ్విన్‌కు వికారాబాద్‌లోని మహవీర్ మెడికల్ కాలేజీలో ఎంబిబిఎస్ సీటు సాధించినందుకు గాను జైభీమ్ వారియర్స్ కమిటీ సభ్యులు అందరు కలిసి సన్మానించారు. జీవనతోనే కమిటీ సభ్యులు మాట్లాడుతూ నిరుపేద కుటుంబం నుండి వచ్చిన జీవనకు ఎంబిబిఎస్ సీటు సాధించడం ఎంతో సంతోషమని సభ్యులు తెలియజేశారు. నిరుపేదలకు ఉచితంగా సేవ చేయాలని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు అర్జున్, మాజీ వార్డు సభ్యులు మోదుగు లక్ష్మయ్య, పమ్మి దాసు, కుక్కల నాగభూషణం, కరిశ రమేష్, చలపతి, వినోద్‌కుమార్, నర్సింహారావు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# సెమీ క్రిస్మస్ సంబరాలను జయప్రదం చేయండి



ప్రజాపక్షం/ కల్లూరు: కల్లూరు మున్సిపాలిటీ లోని లక్కినేని వారి ఆవరణలో నిర్వహించనున్న సెమీ ఐక్య క్రిస్మస్ వేడుకలు విజయవంతం చేయాలని ఏబిసీసీ రాష్ట్ర అధ్యక్షులు రేవరెండ్ పిఎన్ఆర్ క్రైస్తవులకు, క్రైస్తవేతరులకు పిలుపునిచ్చారు. సోమవారం మండల పాస్టర్స్ సమావేశం టిజిఎం వర్షిప్ కేంద్రం నందు ఏర్పాటుచేసిన శమీ ఆదిత్య క్రిస్మస్ సంబరాల పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని వినోద్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాల్లో పాల్గొని క్రీస్తు జన్మ రహస్యాన్ని ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని, ఆయన లోక రక్షకుడు అని ప్రేమ, శాంతి, సమాధానం ఆవశ్యకతను తెలుసుకోవాలని ప్రతి ఒక్కరిని కోరారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు నిర్మల్ కుమార్, దాసరి డేవిడ్, రాజ్ కెనాడి, రాజు దయాకర్, జాన్ పరంజ్యోతి, సంజీవరావు, జీవన్ కుమార్, పిడిదాస్, రాజశేఖర్ లూకా, మోజేష్ తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభను జయప్రదం చేద్దాం




**-సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు రావులపల్లి**
**-40 దేశాల నుండి రానున్న ప్రతినిధులు**
**-5 లక్షల మందితో భారీ బహిరంగ సభ**

**ప్రజాపక్షం/భద్రాచలం :** పీడిత తాడిత ప్రజల జీవితాలకు భరోసా కల్పించేందుకు దేశ స్వతంత్రానికి కంటే ముందే ఆవిర్భవించిన భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శత వసంత ముగింపు సభ ఖమ్మం కేంద్రంగా జరగనుందని, ఈ బహిరంగ సభను జయప్రథం చేసేందుకు ప్రతీ ఒక్కరూ పాటుపడాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు రావులపల్లి రవికుమార్ అన్నారు. శత వసంత ఉత్సవాల కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక డివిజన పార్టీ కార్యాలయంలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతగడ్డపై కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి ఈ డిసెంబర్ 26 నాటికి వందేళ్లు పూర్త వుతుందని, దేశ స్వతంత్ర సంగ్రామంలో బానిస సంకెళ్ల నుండి భరత మాత విముక్తి కోసం కమ్యూనిస్టు కార్యకర్తలు అలుపెరగని పోరాటాలు చేశారన్నారు. భగత్‌సింగ్ లాంటి యువ కిషోరాలు నమ్మిన సిద్ధాంతం కోసం ఉరి కొయ్యలను సైతం ముద్దాడారని గుర్తు చేశారు. ఆనాటి నుండి నేటి వరకు పీడత ప్రజల పక్షాన నిలబడింది ఎర్రజెండా మాత్రమే అని, ఎర్రజెండాల పని అయిపోయిందని అవహేళన చేసిన వారికి ఈ శతవసంత ఉత్సవాల బహిరంగ సభ గుణపాఠం కావాలన్నారు. 40 దేశాల నుండి కమ్యూనిస్టు పార్టీలప్రతినిధులు, మేధావులు, కవులు, కళాకారులు ఉత్సవ ముగింపు సభకు తరలివస్తున్నారని, ఈ బహిరంగ సభను మరింత ఎరుపెక్కించేందుకు తమతమ ప్రాంతాల నుండి వేలాదిగా జనాలను తరలించాలని పిలుపునిచ్చారు. 5 లక్షల మందితో ఖమ్మం కేంద్రంగా జరిగే ఉత్సవాల ముగింపు సభ దేశానికే గర్వకారణం కానుందన్నారు. ఎర్రజెండా నీడలో అమరులైన ప్రతీ ఒక్కరికీ ఈ శతవసంత ఉత్సవం అంకితం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు వాతాడి దుర్గారావు, పట్టణ కన్వీనర్ మారెడ్డి శివాజీ, ఏఐటియూసి పట్టణ కార్యదర్శి కంభంమెట్టు శ్రీనివాస్, నాయకులు ఏపూరి వెంకటేశ్వరరావు, ఎస్‌విఎస్ నాయుడు, సత్యానంద్, గుంజా రామారావు, సోభన్, సీతారామరాజు, సాయిరాం, సూరిబాబు, సతీష్, రామశంకర్, ఉమాదేవి, కుమారి పాల్గొన్నారు.

# గిరిజన మ్యూజియం ఏర్పాటు భేష్

**- రూపకల్పన చేసిన పిఓను అభినందించిన కెనడా బృందం**





**ప్రజాపక్షం/భద్రాచలం :** గిరిజన సంస్కృతి సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, కట్టుబాట్లు అంతరించిపోకుండా నేటి యువతరం తెలుసుకునే విధంగా గిరిజన మ్యూజియం రూపకల్పన బాగుందని కెనడ దేశానికి చెందిన ఆల్‌బెర్ట్ కాలేజీ ఆఫ్ సోషల్ వర్కర్ ఎన్జీఓ ఆర్గనైజర్ జోసెఫ్ జాక్సన్ అన్నారు. సోమవారం ఐటిడిఏ ప్రాంగణంలోని ట్రైబల్ మ్యూజియాన్ని కెనడా దేశం, ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ఎన్‌జిఓ బృందం సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా గిరిజనుల అన్ని కళాకండాలను తిలకించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన మ్యూజియాన్ని ఏర్పాటు చేసేందుకు కృషి చేసిన ఐటిడిఏ పిఓ రాహుల్‌ను అభినందించారు. దట్టమైన అటవీ ప్రాంతం, కొండకోనల్లో నివశించే ఆదివాసీ గిరిజనుల జీవన విధానాలను సాంప్రదాయాలను అధ్యాయనం చేసేందుకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు రావడం జరిగిందన్నారు. గిరిజనులు అధిక శాతం నివశించే జిల్లాల్లోని గిరిజన గ్రామాల్లో పర్యటించి భద్రాద్రి కొత్తగూడె ం జిల్లాకు రావడం జరిగిందని చెప్పారు. గిరిజనుల జీవన విధానాలు, సంస్కృతి సంప్రదాయాలు పాతకాలపు గిరిజనుల పనిముట్లు పొందు పరిచిన ఈ మ్యూజియం భద్రాచలంలో ఉన్నట్లు తెలుసుకుని సందర్శన నిమిత్తం ఇక్కడికి చేరుకున్నట్లు వివరించారు. అంతరించిపోతున్న దానిని నేటి తరానికి తెలిసే విధంగా మ్యూజియాన్ని రూపొందించడం, అందులో ఉంచిన కళాకండాలు ఏర్పాటు చేయడంతోపాటు అర్థమయ్యే రీతిలో అచ్చు వేసి అక్కడ పెట్టడం అభినందనీయం అన్నారు. గిరిజన వంటకాలు, ఇప్పపువ్వు లడ్డూలు,మిల్లెట్ బిస్కెట్లు చాలా రుచిగా ఉన్నాయని చెప్పారు. వీటిని తినడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఛత్తీస్‌గడ్ బృందం సభ్యులు పపుల్ల వాసం, మ్యూజియం ఇంచార్జ్ వీరస్వామి, నిర్వాహకులు రాజేష్, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

# వీధి కుక్కల దాడిలో 18 గొర్రెలు మృతి

**రూ. 1.20 లక్షలు నష్టం**



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** వీధి కుక్కల దాడులు రోజు రోజు కు పెరుగుతున్నాయి. గొర్రెల దొడ్డి గోడ దూకి గొర్రెల మంద పై దాడి చేసి విచక్షణరహితంగా దాడి . చేయటంతో గొర్రెలు మృతి చెందాయి. బాధిత రైతు కధనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నేలకొండపల్లి మండల కేంద్రం కు చెందిన మేట్టేల వెంకన్న అనే గొర్రెల కాపరి కి చెందిన దొడ్డి పై సోమవారం తెల్లవారు జామున వీధి కుక్కలు దాడి చేశాయి. గొర్రెల దొడ్డిలోకి దూకి గొర్రెల మంద పై మూకుమ్మడి దాడి చేశాయి. ఈ దాడిలో 18 గొర్రెలు మృతి చెందాయి. అప్పటికే అలజడి కావటంతో దొడ్డి వద్ద కు కాపరులు రావటంతో వీధి కుక్కల గుంపు అక్కడి నుంచి పరారైయ్యాయి. లేకుంటే మరింత నష్టం జరిగేదని బాధితులు వాపోయారు. ప్రస్తుతం దాదాపు రూ.1.20 లక్షల వరకు బాధిత రైతు కు నష్టం జరిగింది. మండల కేంద్రంలో విచ్చలవిడిగా సంచరిస్తున్న వీధి కుక్కల వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల బోదులబండ లో కూడ గొర్రెల కాపరి దొడ్డిలో మంద పై దాడి చేయటంతో గొర్రెలు మృతి చెందాయి. గొర్రెల కాపరులకు తీరని నష్టం జరుగుతుందని తగిన చర్యలు తీసుకోవాలని బాధిత రైతులు కోరారు. బాధిత రైతు ను పలువురు పరామర్శించి బాధిత గొర్రెల కాపరిని ప్రభుత్వం ఆదుకోవాలని, అదే విధంగా వీధి కుక్కల నివారణ కు తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరారు.

# కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని నాచేపల్లి ప్రాథమిక వ్యవసాయ సహాకార పరపతి సంఘం చైర్మన్ తన్నీరు సత్యనారాయణ సూచించారు. మండలంలోని నాచేపల్లి లో సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం ను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధర ను అందించేందుకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతులు తొందరపడి దళారులను ఆశ్రయించి మోసపోవద్దని సూచించారు. నాణ్యత ప్రమాణాలు పాటించి మద్దతు ధర ను పొందాలని సూచించారు. తేమ 17 శాతం ఉండే విధంగా అరబెట్టుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రం సిబ్బందికి రైతులు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో సొసైటీ ఉపాధ్యాక్షుడురేగళ్ల రవి, డైరెక్టర్లు వెంకట రామారావు, నల్లాని మల్లిఖార్జున్ రావు,శివరాజు, దండా సత్యనారాయణ, జగన్నాధం, సీఈవో, సిబ్బంది రైతులు తదితరులు పాల్గొన్నారు.

# అందెశ్రీ మృతి రాష్ట్రానికి తీరని లోటు



**ప్రజాపక్షం/పాల్వంచ :** తెలంగాణ రాష్ట్ర గీతం రచయిత ఉద్యమకారులు అందెశ్రీ మృతి రాష్ట్రకిని తీరని లోటని తెలంగాణ ప్రజానాట్య మండలి నాయకులు అన్నారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో తెలంగాణ ప్రజా నాట్యమండలి ఆధ్వర్యంలో అందెశ్రీకి ఘన నివాళులర్పించారు. ముందుగా అందెశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సబ్యులు ముత్యాల విశ్వనాథం మాట్లాడుతూ చిన్నతనం నుండే కష్టనష్టాలను చవిచూసిన అందెశ్రీ రచయితగా, వక్తగా, పాటలు పాడుతూ పల్లె జనాన్ని చైతన్యపరచటంలో కృషి చేసిన అందెశ్రీ అకాల మరణం బాధాకరమన్నారు. తన రచనలతో, పాటలతో తెలంగాణ యాసకు ఔన్నత్యాన్ని తెచ్చిన గొప్ప వ్యక్తి అందెశ్రీ అన్నారు. తెలంగాణ ఉద్యమంలో తన రచనలతో, పాటలతో ప్రజల్ని ఉద్యమం వైపు మరల్చిన గాయకుడని కొనియాడారు. అందెశ్రీ ఆశయాలను సాధించన నాడే ఆయనకు నిజమైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, ప్రజానాట్యమండల రాష్ట్ర కార్యదర్శి కొండలరావు, జిల్లా ప్రజానాట్యమండల అద్యక్షులు శనగారపు శ్రీనివాసరావు, ప్రజానాట్యమండల మండల కార్యదర్శి నిమ్మల రాంబాబు, కొత్త క్రిష్ణ, కొత్తపల్లి రామారావు, వెంకన్న, అల్లి వెంకటేశ్వర్లు, రామాచారి, పాషా, ఇట్టి వెంకటరావు, అన్నారపు వెంకటేశ్వర్లు, వీసంశెట్టి పద్మజ, వాంకుడోత్ రవి, సత్యనారాయణ, నరహరినాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** మండలంలో ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని టిఎస్‌యుటిఎఫ్ ఎంఇఓ శాంత రావుకి వినతి పత్రం అందించారు. ఈసందర్భంగా టిఎస్‌టియుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఈ హాతిరామ్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు అనే సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే స్పందించి పరిష్కరించాలని కోరారు. ఈకార్యక్రమంలో టిఎస్‌యుటిఎఫ్ మండల అధ్యక్షులు ఏ రామకృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి బి సురేష్, మండల నాయకులు వీరన్న బాబు, సమ్మక్క, పార్వతిలు పాల్గొన్నారు.

# సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభను జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు బహిరంగ సభను జయపద్రం చేయాలని కోరుతూ గడప గడపకు ప్రచారం, విరాళాల సేకరణ విస్తృత స్థాయిలో నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎటువంటి అధికారం లేకుండా కమ్యూనిస్టు పార్టీ 100 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం అనేది చారిత్రకమైన ఘట్టమని తెలిపారు. ఈకార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రేసు ఎల్లయ్య, మండల కార్యదర్శి కొమరం హనుమంతరావు, మండల సహాయ కార్యదర్శి వజ్జ పగడయ్య, ఏఐటియూసి మండల ప్రధాన కార్యదర్శి కుంట సహదేవ్, మండల నాయకులు రేసు సురేందర్, కండే రాంబాబు, కందిమల్ల సతీష్, గొగ్గల రాజేందర్, సుతారి కాంతారావు, నాతి దుర్గేష్, యువజన నాయకులు కసనబోయిన నరేష్, తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపుసభను జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు బహిరంగ సభను జయపద్రం చేయాలని కోరుతూ సోమవారం బెండాలపాడులో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ ప్రచార కరపత్రాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఖమ్మంలో డిసెంబర్ 26న జరిగే భారీ బహిరంగ సభను విజయవంతం కోసం విరాళాలు సేకరిస్తూ ప్రచారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు, చంద్రుగొండ సిపిఐ మండల కార్యదర్శి బొర్రా కేశవరావు, సిపిఐ జిల్లా సమితి సభ్యులు జడ శ్రీను, బెండాలపాడు శాఖ కార్యదర్శి కుర్సం రాములు, కుంజ నాగేశ్వరరావు, నారాయణ, వర్స రాములు, కుంజ నరేష్, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# నేడు కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులు పంపిణి

**ప్రజాపక్షం/భద్రాచలం :** మండల పరిధిలోని కళ్యాణ లక్ష్మీ , షాబీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమాని నేడు నిర్వహించనున్నట్లు తహశీల్దార్ దనియాల వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎల్‌ఏ తెల్లం వెంకట్రావు చేతుల మీదుగా నేడు స్థానిక తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో ఉదయం 11 గం.లకు చెక్కుల పంపిణీ ఉంటుందని, దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు సకాలంలో హాజరై చెక్కులు అందుకోవాలని చెప్పారు.

# సింగరేణి సంస్థ పరిరక్షణకు పటిష్టమైన చర్యలు చేపట్టండి




**- ప్రభుత్వ పెన్షన్ అమలుకు సిఫార్సు చేయండి**
**- సింగరేణి పురిటిగడ్డ ఇల్లందు మనుగడకు చర్యలు తీసుకోవాలి**
**- పలు సమస్యలపై సింగరేణి సిఎంఅండ్ఎండితో చర్చలు జరిపిన ఎంఎల్ఏ కూనంనేని**

**ప్రజాపక్షం/కొత్తగూడెం :** సింగరేణి సంస్థ పరిరక్షణకు యాజమాన్యం పటిష్టమైన చర్యలు చేపట్టి కోల్ బెల్ట్ ప్రాంతాల అభివృద్ధికి కృషి చేయాలని గుర్తింపు సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియూసి)గౌరవ అధ్యక్షులు, కొత్తగూడెం ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు సంస్ద సి అండ్ ఎండి బలరామ్‌నుకోరారు. సోమవారం హైదరాబాద్‌లోని సంస్థ ప్రధాన కార్యాలయం సింగరేణి భవన్లో ఆయన స్ట్రక్చరల్ సమావేశం సందర్భంగా మూడు గంటల పాటు చర్చలు జరిపారు. అనంతరం కూనంనేని మాట్లాడుతూ కోల్‌బెల్ట్ ప్రాంతాల్లో విస్తారమైన బొగ్గు నిక్షేపాలు ఉన్నాయని, నూతన గనులు ఏర్పాటు చేయడం ద్వారా బొగ్గు వెలికితీసి ఈ ప్రాంతాల అభివృద్ధికి సహకరించాలన్నారు. సంస్థలో అదనపు కార్మికులు ఉన్నారని పదేపదే చెబుతున్న యాజమాన్యం నూతన గనులు ఏర్పాటు చేసి కార్మికులను సర్దుబాటు చేయాలన్నారు. ప్రైవేటు సంస్థలకు బొగ్గు గనులను అప్పగించే కేంద్ర కుట్రపూరిత చర్యలు అడ్డుకోవాలని, భద్రాద్రి జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలో సంస్థ ఆధ్వర్యంలో థర్మల్ విద్యుత్ పవర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని, ప్లాంట్ ఏర్పాటుకు కావాల్సిన అన్ని రకాల వనరులు ఉన్నాయని అధికారులు తీసుకొచ్చినట్లు తెలిపారు. సంస్థలో పనిచేసి పదవీ విరమణ పొందిన సుమారు పది వేల మందికి పైగా మాజీ కార్మికులు కేవలం రూ.1000 లోపు పెన్షన్ పొందుతున్నారని, వీరికి ప్రభుత్వం అందించే పెన్షన్ అందేలా సిఫార్సు చేయాలన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని, ప్రభుత్వం నుండి కూడా సానుకూల స్పందన లభించిందన్నారు. సింగరేణి ప్రధాన ఆస్పత్రితో పాటు ఏరియా ఆస్పత్రుల్లో గుండె సంబందిత కార్మిక రోగుల కాట్లాగ్ ఏర్పాటు చేసి అందుకు సంబంధించిన మెరుగైన వైద్యం, ఆధునిక పరికరాలు ఆస్పత్రుల్లో అందుబాటులోనికి తేవాలని సూచిమన్నారు. తమ ప్రతిపాదనలపై సంస్థ సి అండ్ ఎండి బలరామ్ సానుకూలంగా స్పందించారని, త్వరితగతిన తమ ప్రతిపాదనలు అమలు చేసేందుకు యాజమాన్యంపై ఒత్తిడి తెస్తామని కూనంనేని తెలిపారు.

# వివాహిత ఆత్మహత్య



**ప్రజాపక్షం/ఇల్లందు:** ఇల్లందు మండలం లచ్చగూడెం గ్రామానికి చెందిన కమటం వెంకటేశ్వర్లు కూతరు అంజలికి అదే గ్రామానికి చెందిన చిట్టూరి సాయికుమార్‌తో 14మే2025న వివాహం జరిపించారు. వివాహ ఒప్పందం ప్రకారం అంజలి తల్లిదండ్రులు వరకట్నం కింద రెండు ఎకరాల భూమి, పది లక్షల నగదు, ఇచ్చి వైభవంగా పెళ్లి జరిపించారు. అంజలి భర్త హైదరాబాద్‌లో ఉద్యోగ చేస్తున్నాడు. పెళ్లి తర్వాత అంజలిని సొంత ఊరిలోనే ఉంచి అప్పుడప్పుడు వచ్చి వెళ్లేవాడు. కొద్ది నెలలకు నాకు సంపాదన బాగా ఉంది మీ వాళ్ళు ఇచ్చిన చేను, నగదు సరిపోదు అదనంగా కావాలని భర్తతో పాటు కుటుంబ సభ్యులు వేధింపులకు గురి చేశారని అంజలి కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ క్రమంలోనే గ్రామంలోని కుల పెద్ద మనుషుల మధ్య పంచాయితీ పెట్టగా మంచిగా చూసుకుంటానని చెప్పి హైదరాబాద్ తీసుకెళ్లాడని తెలిపారు. అక్కడకు వెళ్ళాక ఇంటి చుట్టూ సిసి కెమెరాలు అమర్చి నిఘా పెట్టడంతో పాటు అంజలిని శారీరకంగా, మానసికంగా చిత్ర హింసలకు గురి చేశారని, ఇది తట్టుకోలేక పురుగుల మందు తాగితే ఇల్లందు ప్రభుత్వ వైద్యశాలకు తీసుకురాగా అక్కడ నుండి ఖమ్మం ప్రభుత్వ వైద్యశాలకు తరలించామని చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందిందని ఆ సమయంలో భర్త కుటుంబ సభ్యులు పరాయ్యారని అంజలి కుటుంబ సభ్యులు తెలిపారు. తన కూతురు మరణానికి కారణమైన భర్త సాయికుమార్, అత్త మామ ఉమ, ఉపేందర్, ఆడబిడ్డ నిరంజనీ(పావని) భర్త జవ్వాజి మోహన్ ప్రసాద్‌లు కారణమని వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు అంజలి తండ్రి వెంకటేశ్వర్లు తెలిపారు.

# సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

**-వ్యతిరేక వార్తలపై చర్యలు చేపట్టాలి**
**-ధాన్యం, పత్తి, మొక్కజొన్న సేకరణ సజావుగా జరగాలి**
**-జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రజా సమస్యల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో ప్రాధాన్యత కార్యక్రమాల అమలుపై అదనపు కలెక్టర్లు డా॥ పి.శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి లతో కలిసి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దినపత్రికలలో ప్రచురితమవుతున్న వ్యతిరేక వార్తలకు సంబంధిత అధికారులు తీసుకున్న చర్యలపై నివేదిక సమర్పించాలన్నారు. 83 వ్యతిరేక వార్తలకు వివిధ శాఖల నుంచి తీసుకున్న చర్యల నివేదికలు రావాల్సి ఉందని వారం లోగా నివేదిక సమర్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజావాణికి సంబంధించి వివిధ శాఖలకు సంబంధించి 201 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని యుద్ధ ప్రాతిపదికన పరిష్కారం చేయాలన్నారు. మంత్రుల నుంచి ప్రజా సమస్యల పరిష్కారానికి సంబంధించి వివిధ శాఖల నుంచి 152 దరఖాస్తులకు సంబంధించి 21 దరఖాస్తులకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. నిబంధనల మేరకు దరఖాస్తుల పరిష్కారం చేయాలన్నారు. అధికారులు, సిబ్బంది హాజరు పై వారం వారం సమీక్ష చేయాలని డిఆర్‌వోను కలెక్టర్ ఆదేశించారు. ధాన్యం, పత్తి, మొక్కజొన్న కొనుగోళ్లను మండల ప్రత్యేకాధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. ప్రతి శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి నిబంధనల మేరకు కొనుగోలు ప్రక్రియ జరుగుతున్నది పర్యవేక్షించాలన్నారు. సమస్యలు ఉంటే అక్కడికక్కడే పరిష్కరించాలని పరిష్కారం కానిచో వెంటనే తన దృష్టికి తేవాలన్నారు. మండల ప్రత్యేకాధికారులు గురుకుల పాఠశాలల సందర్శన చేయాలని మధ్యాహ్న భోజనం చేసి నాణ్యతను పరిశీలించాలన్నారు. భూ భారతి దరఖాస్తుల పరిష్కారం వేగవంతం చేయాలన్నారు. ఒకటి నుంచి ఐదవ తరగతి పిల్లల్లో పఠనాశక్తి పెంపొందించడానికి ఎఫ్రీ చైల్డ్ రీడ్ కార్యక్రమాన్ని జిల్లాలో అమలు చేస్తున్నామన్నారు. పిల్లల పురోగతిని యాప్ ద్వారా ప్రతి బుధవారం సమీక్షిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో మిగులు రెండు పడకల ఇండ్లను లబ్ధిదారులకు కేటాయించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇటీవల భారీ వర్షాలకు సంబంధించి జరిగిన నష్ట నివేదికలను సంబంధిత అధికారులు వెంటనే సమర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారిణి ఎ. పద్మశ్రీ, డిఆర్‌డివో సన్యాసయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఉర్సే షరీఫ్ 23వ ఉరుసు మహోత్సవ పోస్టర్ విడుదల



**ప్రజాపక్షం/ఇల్లందు:** ఇల్లందు సమీపంలోని సత్యనారాయణపురం గ్రామం సమీప అడవుల్లో కొలువైన ఉర్సే షరీఫ్ 23వ ఉరుసు మహోత్సవ ప్రచార పోస్టర్‌ను సోమవారం నిర్వాహకులు విడుదల చేశారు. ఈసందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ నవంబర్ 19,20తేదీలలో రెండు రోజులపాటు ఈ ఉత్సవాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. 19వ తారీకు సాయంత్రం ఐదు గంటలకు హజరత్ ఖాసీం దులహ దర్గాహ షరీఫ్ నుండి చాధర్ బయలు దేరుతుందని అన్నారు. అదే రోజు ఆరు గంటలకు సందల్ ఉంటుందని అన్నారు. 20వ తారీకున ఉదయం 8గంటలకు జులుస్ నెంబర్ 2 బస్తి దర్గా నుండి బయలు దేరుతుందని అన్నారు. అదే రోజు మధ్యాహ్నం రెండు గంటలకు దావతే హజరత్ ఆరు గంటలకు సలామి ఏడు గంటలకు కవ్వాలి ప్రోగ్రాం ఉంటుందని అన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయపద్రం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో నిర్వాహకులు పాల్గొన్నారు.

# బానోత్ సోనీకి నివాళుర్పించిన ఎంఎల్ఏ కోరం



**ప్రజాపక్షం/ఇల్లందు:** ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలోని స్టేషన్ బస్తి మాజీ వార్డు కౌన్సిలర్, ఇల్లందు పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు బానోత్ రవి నాయక్ అమ్మ బానోత్ సోనీ అనారోగ్యంతో మృతి చెందారు. సోమవారం స్టేషన్ బస్తీలో పెద్ద కర్మల కార్యక్రమానికి ఇల్లందు ఎంఎల్ఏ కోరం కనకయ్య హాజరై, సోనీ చిత్రపటానికి పూలదండ వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొడ్డా డానియల్, ఇల్లందు పట్టణ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎండి జాఫర్, ఇల్లందు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, న్యాయవాది స్వర్ణపాక సత్యనారాయణ, ఇల్లందు పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు పడిదల నవీన్ కుమార్, యానగంటి చిన్న శ్రీను, దళితరత్న మేకల శ్యామ్ మాదిగ, ఈసం లక్ష్మ ణ్, పూణెం సురేందర్, రవి వర్మ, మల్లిపెద్ది కమలాకర్, గూగుల్ రాజేష్, పాల్గొని వారికి ఘన నివాళులర్పించారు.

# గంజాయి హాట్ స్పాట్స్‌ను తరచుగా తనిఖీ చేయాలి




**- సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలి**
**- బాధితులకు సత్వర న్యాయం జరిగేటట్లు కృషి చేయాలి**
**- పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్‌పి రోహిత్‌రాజు**

**ప్రజాపక్షం/పాల్వంచ :** గంజాయి హాట్ స్పాట్స్‌ను నిరంతరం తనిఖీ చేయాలని, సైబర్ నేరాల భారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా ఎస్‌పి బిరుదురాజు రోహిత్‌రాజు అన్నారు. పాల్వంచ పోలీస్ స్టేషన్‌ను ఆయన సోమవారం తనిఖీ చేశారు. పరిసరాలను పరిశీలించారు. నమోదైన కేసుల వివరాలను అడిగి తెలుసుకొన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, సమస్యలతో స్టేషన్‌కు వచ్చే బాదితులకు న్యాయం జరిగేటట్లు బాధ్యతగా మెలగాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల పట్ల చట్ట పరమైన కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. సైబర్ నేరాల పట్ల స్టేషన్ పరిధిలో గల గ్రామాలలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు. పెట్రోలింగ్, బ్లూకోట్స్ వాహనాలలో తిరుగుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. పోలీస్ అధికారులు, సిబ్బంది తమ ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వృత్తి పరమైన, వ్యక్తిగత సమస్యలు తలెత్తినా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.ఈ కార్యక్రమంలో డిఎస్‌పి సతీష్ కుమార్, సిఐ సతీష్, ఎస్ఐలు కే. సుమన్, జీవన్‌రాజు, కళ్యాణి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అమ్మకు అక్షర మాలను జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/భద్రాచలం :** నవభారత్ సక్షరతా కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న అమ్మకు అక్షర మాల కార్యక్రమాన్ని జయప్రథం చేయాలని ఎంపిడిఓ బి ఆదినారాయణ అన్నారు. స్థానిక మెడికల్ కాలనీలో ఈ కార్యక్రమాన్ని ఆయన సోమవారం ప్రారంభంచారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ పదిహేను సం.లు నిండిన ప్రతీ మహిళా ఈ ఉల్లాస్ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని, మహిళలు విద్యాభివృద్ధి సాధించినప్పుడే ఆర్థికాభివృద్ధి సాధిస్తారని తెలిపారు. వాలంటీర్లు స్వచ్ఛందంగా పనిచేస్తూ నిర్క్షరాస్యులైన మహిళలను అక్షరాస్యులుగా మార్చాలని కోరారు. భద్రాచలం మండలంలో 162 మంది వాలంటీర్లు 1620 మంది నిరక్షరాస్యులకు అక్షరాలు నేర్పే కార్యక్రమాన్ని జయప్రథం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఇఓ తోటమల్ల రమ మాట్లాడుతూ ఇంటిలోని ఇల్లాలు చదువుకుంటే ఆ కుటుంబం అంతా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని అర్హులైన మహిళంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఏపిఎం త్రిగుణ మాట్లాడుతూ ఎంపిడిఓ, ఎంఇఓ సహకారంతో కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో జగదీష్ కాలనీ ప్రధానోపాధ్యాయులు రాజా శ్రీనివాస్, సిసిలు సీతారామ్, రమేష్, విఓఏలు, వాలంటీర్లు, అభ్యాసక మహిళలు తదితరులు పాల్గొన్నారు.